ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 38.0
కనిష్ఠం : 28.0

సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లను ఆకట్టుకోవడానికి అభ్యర్థులంతా బహుమతులు పంచారు. ఓటుకి రేటు కట్టారు. గ్రూపుల వారీగా లెక్క కట్టి వారి ఖాతాల్లో వేశారు. నియోజకవర్గం నుంచి పోటీ చేసిన అభ్యర్థులంతా పోటీలు పడి మరీ రూ.40 నుంచి రూ.50 కోట్ల వరకు నోట్లకట్టలు విసిరారు. ఒక్క ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలో దాదాపు రూ.400 కోట్లకు పైబడే ఖర్చు చేసినట్లు అంచనా. కాని ఇంత సొమ్ము పంచితే ఎక్కడ దీని ప్రభావం మార్కెట్ల మీద పొడ చూపలేదు. బ్యాంకుల్లో రుణాలు తీర్చింది లేదు. ఈ సొమ్మంతా ఏమైపోయినట్లు?



ఓటర్లకు చేరిన సొమ్ము రూ.400 కోట్లు

ఏమైంది?

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అభ్యర్థులంతా అధికారుల కళ్ళు కప్పి, ఓటర్ల మనసు గుర్తించి ఎడాపెడా నోట్లు విసిరారు. ఓటుకు ఇంత అని డిమాండ్ చేసిన వారికి అంతే మొత్తంలో, ఇంకొందరికి తాము ఎంతిస్తే అంతే అనుకునే వారికి అంత మొత్తంలోనూ చేతిలో పెట్టి ఓటు నమస్కారం పెట్టారు. తమను గెలిపించాలని పదే పదే అభ్యర్థించారు. మహిళా ఓటర్లను ఆకట్టుకోవడానికి డ్వాక్రా సంఘాలను లెక్కకట్టి మరీ పంపకాలు చేశారు. ఎక్కడా గుట్టు బయట పడకుండా అన్ని మహిళ, పురుష సంఘాలతోపాటు కులాలవారీగా కొన్ని గుర్తించిన సంఘాలకు పెద్ద మొత్తంలోనే నగదు బదిలీచేశారు. జిల్లాలో 43,840 మహిళా పొదుపు సంఘాలు ఉన్నాయి. ఒక్కో సంఘానికి రూ.10 వేలకు తగ్గకుండా ప్రధాన పక్షాల అభ్యర్థులు చెల్లించారు. ఈ సంఘాల్లో నాలుగు లక్షల 36 వేల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. లోక్‌సభ స్థానం పరిధిలో 15 లక్షలకుపైగా ఓటర్లు ఉండగా, వాటిలో సగానికి సగం మహిళలే. ఈ లెక్కన డ్వాక్రా సంఘాలకు పెద్ద ఎత్తున ఎన్నికల్లో నగదు ముట్టచెప్పినట్లు ప్రచారం గుప్పుమంది. ప్రచారం జరుగుతున్నట్లు ప్రధాన పక్షాలు ఈ సంఘాల్లో మహిళలకు దాదాపు రూ.100 కోట్ల వరకు ఇచ్చినట్లు అంచనా.

స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళా ఓటర్లకు, ఇతర ఓటర్లకు చేతికి డబ్బు అందిన వెంటనే మార్కెట్‌పై పడే వారు. గృహావసరాలకు వీలుగా ఎలక్ట్రానిక్ పరికరాలతో సహా మిగతా వాటికి వచ్చిన డబ్బు అంతా సర్దేసేవారు. కాని ఈసారి సార్వత్రిక ఎన్నికల పోలింగ్ పూర్తయ్యి పది రోజులు గడుస్తున్నా ఏలూరు జిల్లా మార్కెట్‌లపై ఈ ప్రభావం ఎక్కడా కనిపించలేదు. కూలర్లు, ఫ్రిజ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ గ్రూడ్స్‌తోపాటు షాపింగ్ మాల్స్‌లోనూ అమ్మకాలు పెరగలేదని అంచనా వేస్తున్నారు. 'బయట ఖర్చులు భారీగా పెరిగిపోయాయి. ఎంత వచ్చినా సరిపోవడం లేదు. నెల వారీ విద్యుత్ ఛార్జీలతోపాటు మిగతావన్నీ తలకు మించిన భారంగా మారాయి. ఓటుకు డబ్బు తీసుకుంటున్నామని చులకన చేస్తున్నారే తప్ప ఇంటిని గట్టు ఎక్కించేందుకు తృణమో పణమో ఆశించక తప్పట్లేదంటే ఎవరైనా నమ్ముతారా ? ఇక బయట మార్కెట్‌కు వెళ్ళి ఏం కొంటాం, వచ్చే నెల స్కూల్ తెరుస్తారు. కాబట్టి ఇంటి ఖర్చు రెట్టింపవుతుంది" అంటూ ఏలూరుకు చెందిన ఓ మధ్య తరగతి కుటుంబీకురాలి మనోభిప్రాయం. మహిళా గ్రూపు సంఘాల్లోనూ వచ్చిన డబ్బుల్లో అత్యధిక భాగం పాత రుణాలు చెల్లించటానికే సరిపోయిందని కొందరు వాదిస్తున్నారు. బ్యాంకర్లు మాత్రం ఈ స్థాయిలో చెల్లింపులు పుంజుకోలేదని చెబుతున్నారు. సామాజికవర్గాల వారీగా కొందరికి గంపగుత్తగా ఓటర్లను ఆకర్షించేందుకు ప్రయత్నించారు. 100 మందికి తగ్గకుండా గ్రూపుగా ఉన్న మహిళా సంఘాలకు లక్షన్నర నుంచి మూడు లక్షల వరకు చెల్లించారు. కొన్ని మండలాల్లో 500 మందికి తగ్గకుండా ఉన్న వారికి మనిషికి వెయ్యి చొప్పున లెక్కకట్టి అక్షరాల రూ.5 లక్షలను జేబులో పెట్టారు. ఒక అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రధాన పక్షాల అభ్యర్థులే రూ.40 కోట్ల నుంచి రూ.50 కోట్లు ఖర్చు చేసినట్లు ఒక అంచనా. ఈ లెక్కన ఏడు నియోజకవర్గాల్లోనూ రూ.400 కోట్లకు తక్కువ కాకుండా నగదు ఓటర్ల వద్దకు చేరినట్లే. గత ఎన్నికల్లో అయితే అత్యధికులు టూ వీలర్స్ కొనుగోలుకు, ఎలక్ట్రానిక్ వస్తువులు కొనుగోలుకు ప్రాధాన్యత ఇవ్వడంతో రూ.250 కోట్ల మేర అమ్మకాలు సాగాయని అప్పట్లోనే విశ్లేషించారు. ఈసారి దానికిమించి భారీగా నగదు వినియోగం జరిగినా, అంతా సైలెంట్‌గా ఉండటం కొత్త పరిణామంగా భావిస్తున్నారు.

మార్కెట్లో కొనుగోళ్లపై కనిపించని ప్రభావం

ఎందుకింత సైలెంట్ అంటూ వ్యాపారుల ఆరా

నో ఫ్లై జోన్‌లో.. స్ట్రాంగ్‌రూమ్


స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేసి సంతకం చేస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్

మూడంచెల భద్రత.. నిరంతరం సీసీ కెమేరాల పర్యవేక్షణ

- ఓట్ల లెక్కింపునకు వీలుగా ఇప్పటి నుంచే కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- అనధికారిక వ్యక్తుల కదలికలకు నో
- ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా, భారీగా ముగిసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాజకీయ పక్షాల అభ్యర్థులతోపాటు అందరూ సంయమనంగా వ్యవహరించారు. అధికారులు ప్రదర్శించిన ముందుచూపు పోలింగ్ ప్రశాంతంగా ముగిసేలా చేసింది. ఇప్పుడు కీలకదశ ఓట్ల లెక్కింపు. ఈ అంశంలో ఎన్నికల కమిషన్ కఠిన నియమాలను అమలుచేస్తోంది. ఎక్కడా గొడవలకు, ఘర్షణలకు తావు లేకుండా కఠిన చర్యలకు దిగింది. ఏలూరు జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాల నుంచి ఈవీఎంలు, సర్ సీఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలకు తెచ్చి స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపరిచారు. పారా మిలటరీ బలగాలను, ఆర్మ్‌డ్ రిజర్వుడ్ పోస్టుతోపాటు సివిల్ పోలీసులను మోహరించారు. వచ్చే నెల 4న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈలోపే ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎన్నికల కమిషన్ ఎక్కడికక్కడ చర్యలు తీసుకుంటోంది. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద నిర్దేశించిన క్రమంలో కలెక్టర్, ఎస్పీలతోపాటు సంబంధిత అధికారులు ఏ రోజుకా రోజు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ప్రతి నియోజకవర్గ స్ట్రాంగ్ రూమ్‌ను ఆయా నియోజకవర్గాల ఆర్వోలు విధిగా తనిఖీ చేస్తున్నారు. జిల్లా ఎన్నికల యంత్రాంగం ఇప్పటికే పలుమార్లు స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత, సీసీ కెమెరాల నిర్వహణ వంటి వాటిపై ప్రత్యక్ష పర్యవేక్షణ చేసింది. జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేశ్, ఎస్పీ మేరీప్రశాంతి పలుమార్లు సందర్శించి భద్రతా సిబ్బందికి తగు సూచనలు చేశారు. స్ట్రాంగ్ రూమ్‌ల పరిసరాల్లో ఇకపై నో ఫ్లై జోన్‌గా కలెక్టర్ ప్రకటించారు. ఈ నెల 20నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు ఆదేశాలు అమల్లో ఉంటాయని మంగళవారం వెల్లడించారు. అనుమతి లేకుండా నిషిద్ధ ప్రాంతంలో డ్రోన్స్‌తోపాటు ఎలాంటి ఎగిరే యంత్రాలను ఎగురవేయరాదు. చిత్రీకరణ చేయరాదని, అలా చేస్తే సీరియస్‌గా తీసుకుంటామని హెచ్చరించారు.


ఏలూరు స్ట్రాంగ్ రూమ్ తనిఖీ చేసి సంతకం చేస్తున్న ఎస్పీ

మూడంచెల భద్రత

స్ట్రాంగ్‌రూమ్‌ల పరిసరాల్లో మూడెంచెల భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తున్నట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. అనధికార వ్యక్తులు ఎవరూ అనుమతి లేకుండా వీటి పరిసరాల్లో సంచరించవద్దంటూ వార్నింగ్ ఇచ్చారు. ఈ కౌంటింగ్ పూర్తయ్యే వరకు కంటి మీద కునుకు లేకుండా భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించాలని నిర్ణయించారు. సీసీ కెమెరాల నిర్వహణపై పూర్తిగా దృష్టిపెట్టారు. ఓట్ల లెక్కింపునకు వీలుగా ఎన్నికల కమిషన్ తగు మార్గదర్శక సూత్రాలను జిల్లా ఎన్నికల అధికారులకు వివరించే పనిలో పడింది.

కౌంటింగ్ పరిశీలకుల నియామకం

ఏలూరు సిటీ, మే 21: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఏలూరు లోక్‌సభ నియోజకవర్గంతోపాటు దాని పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు వచ్చే నెల 4న వట్లూరు సర్ సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఈ నియోజకవర్గాల పరిశీలకులను నియమించారు. ఉంగుటూరు, చింతలపూడిలకు ఎస్‌పి రామన్ (94458 83226), దెందులూరుకు డాక్టర్ వి.అలిన్ సునేజా (98409 66356), ఏలూరు, కైకలూరులకు డాక్టర్ కృష్ణకాంత్ పాఠక్(94133 89090), పోలవరం, నూజివీడులకు రామ్ పి.మీనా(99588 07214) బాధ్యతలు నిర్వర్తిస్తారు.

కొనసాగుతున్న కార్డన్ సెర్చ్


ఏలూరు వైఎస్ఆర్ కాలనీలో పోలీసుల కార్డన్ సెర్చ్

ఏలూరు క్రైం, మే 21: సార్వత్రిక ఎన్నికల అనంతరం జిల్లాలో చెదురు మదురు సంఘటనలు జరిగిన నేపథ్యంలో ఏలూరు జిల్లా ఎస్పీ డీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు ప్రతి రోజు కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ కొనసాగిస్తున్నారు. ఈనెల 13న పోలింగ్ సందర్భంగా జిల్లాలో ఎటువంటి సంఘటనలు చోటు చేసుకోలేదు. ఈవీఎంలు గ్రామాల నుంచి తరలివెళ్ళిన తరువాత ముఖ్యంగా ఏలూరు, దెందులూరు, చింతలపూడి నియోజకవర్గాల పరిధిలో వైసీపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తల మధ్య గొడవలు జరిగాయి. వైసీపీ నాయకులు కార్యకర్తలు దాడులకు తెగబడ్డారు. ఈ నేపథ్యంలో కేసులు కూడా నమోదు చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎస్పీ మేరీ ప్రశాంతి గొడవలు జరిగిన ప్రాంతాలు స్వయంగా పరిశీలించారు. ప్రతి రోజు జిల్లాలో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ ఏదోఒక ప్రాంతంలో ఆకస్మికంగా నిర్వహిస్తూనే ఉన్నారు. రౌడీ షీటర్లకు, ట్రబుల్ మంగర్స్‌కు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. మరి కొందరిపై బైండోవర్ కేసులు పెడుతున్నారు. ఏ చిన్న తప్పిదం జరిగినా ఎన్నికల కమిషన్ కఠిన చర్యలే తీసుకుంటుందని జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారు.

జూన్ 5 వరకు బాణసంచా నిషేధం : ఎస్పీ

ఏలూరు క్రైం, మే 21 : 'జిల్లాలో బాణసంచా వినియోగం, అమ్మకాలు, నిల్వలపై వచ్చే నెల ఐదో తేదీ వరకు నిషేధాజ్ఞలు విధించినట్లు జిల్లా ఎస్పీ డి.మేరీప్రశాంతి తెలిపారు. 'ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులు విజయోత్సవ ర్యాలీలో బాణసంచా వినియోగించరాదు. నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. అలాగే ఈవీఎం బాక్సులు, వీవీ ప్యాడ్‌లు భద్రపరిచిన ఏలూరు సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ పరిసర ప్రాంతాలను నో ఫ్లయ్ జోన్‌గా ప్రకటించాం. ఈ ప్రాంతంలోకి అనుమతి లేకుండా ఎవరూ రాకూడదు. డ్రోన్లు, ఇతరత్మైన వాటిని ఎగురవేయకూడదు. వీటిని మీరితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం' అని ఎస్పీ హెచ్చరించారు.

కోకో.. కేక




సేకరించిన కోకో కాయలు

రికార్డు స్థాయి ధర

వెయ్యికి పెరిగినా.. రూ.550 వద్ద నిలిచిన ధర

వాతావరణ మార్పులతో తగ్గిన దిగుబడి

అయినప్పటికీ రైతులకు లాభదాయకం

అంతర పంటలుగా సాగు.. రాయితీలతో మొగ్గు

పెదవేగి, మే 21 : పెరిగిన పెట్టుబడి వ్యయంతో అదనపు ఆదాయానికి రైతులు అంతర్ పంటల వైపు దృష్టి పెట్టారు. వీటిలో ప్రధానమైనది కోకో. మెట్టలో ఎక్కువగా సాగయ్యే కొబ్బరి, ఆయిల్‌పామ్, నిమ్మవంటి ప్రధాన పంటలతోపాటు దీనిని అంతరపంటగా వేస్తున్నారు. కరోనా కారణంగా మూడేళ్ళపాటు ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొన్న రైతులు ఈ అంతర్‌పంటలే కొంతమేర ఆదుకున్నాయి. ఏలూరు జిల్లాలో 32,451 ఎకరాల విస్తీర్ణంలో కోకోను సాగు చేస్తుండగా, ఒక్క పెదవేగి మండలంలోనే ఎనిమిది వేలల్లో వుంది. కోకో ఏడాది పొడవునా కాపు ఉన్నప్పటికీ మార్చి నుంచి మే నెలాఖరు అంటే మూడు నెలలపాటు దిగుబడి బాగుంటుంది. ఈ సమయంలో వచ్చిన గింజలు అధిక నాణ్యత కలిగి, మెరుగైన ధర వస్తుంది. ఈ ఏడాది కోకో కాపు తగ్గి, దిగుబడి 20 శాతానికి పడిపోయింది. దీంతో రైతుల దగ్గర కోకో గింజలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఎకరానికి సరాసరిన ఐదు క్వింటాళ్ళ దిగుబడి వచ్చేది. కానీ ఈ ఏడాది వాతావరణం అనుకూలించకపోవడంతో ఎకరానికి క్వింటాన్నర మించి దిగుబడి రాలేదు.

కిలో వెయ్యికి చేరి..

కోకో గింజలు అత్యధిక ధర కిలో రూ.245. కాని, ఈ ఏడాది ప్రారంభంలో రూ.255లకు చేరి అక్కడి నుంచి పెరుగుతూ ఏప్రిల్ నెలాఖరు నాటికి రూ.వెయ్యి చేరింది. మళ్లీ క్రమేపీ తగ్గుతూ రూ.550 దగ్గర ఆగింది. రూ.వెయ్యి ధర అందుకున్నా రైతు ఆర్థికంగా పుంజుకున్నది లేదు. కాపు బాగుంటే ఐదు క్వింటాళ్ళకు పైబడి దిగుబడి వచ్చేది. ఇదే ధర ఉంటే రూ.ఐదు లక్షలకు తగ్గకుండా ఆదాయం వచ్చేది. కానీ క్వింటాన్నర మించి రాలేదు. దీంతో ఆ రూ.లక్షకే ఆదాయం పరిమితమైందని రైతులు పేర్కొంటున్నారు. కాపు లేకపోవడానికి, ధర పెరుగుదలకు సంబంధం ఉందని రైతులు చెప్పడం లేదు. అలాగైతే గతంలో ఇంతకంటే తక్కువ దిగుబడి వచ్చిన దాఖలాలు ఉన్నాయి. కానీ ఆ సమయంలో రూ.240 మించి ధర పలకలేదు. ఈసారి ఏకంగా కిలో రూ.వెయ్యికి చేరిందంటే కోకోకు మంచి భవిష్యత్ ఉంటుందనే నమ్మకాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు. ధర పెరుగుదలకు ప్రధాన కారణం.. ఘనాలాంటి ఆఫ్రికా దేశాల్లో కోకో పంటను విస్తారంగా పండిస్తారు. ఈసారి పంటంతా తెగుళ్లకు గురై, తోటలన్నీ తొలగించారు. తిరిగి కొత్తగా మొక్కలు నాటడానికి ఆరు నెలలపాటు విరామం ఇచ్చారు. దీంతో దిగుమతి లేకపోవడంతో స్థానికంగా వున్న పంటకు డిమాండ్ పెరిగి, ధర పెరిగినట్లు రైతులు చెబుతున్నారు.



• భారీగా తగ్గిన దిగుబడి

గతేడాది డిసెంబరులో మూడు రోజులపాటు కురిసిన అకాల వర్షంతోపాటు వాతావరణ మార్పుల కారణంగా పూత తగ్గింది. ఈ కారణంగా 20 శాతానికి పంట దిగుబడి పడిపోయింది. ఏటా ఎకరానికి సరాసరిన ఏడు క్వింటాళ్ళకు తగ్గకుండా దిగుబడి వచ్చేది. ఈ ఏడాది క్వింటాన్నరకే పరిమితమైంది. కోకో పంట దిగుమతి తగ్గడంతో స్థానికంగా పంటకు డిమాండ్ పెరిగి, రైతులు ఆర్థికంగా బలపడే అవకాశం ఉంది.

- ఉండ్రు అంబేడ్కర్, కోకో రైతు, తాళ్ళగోకవరం

• ధర పెరిగినా.. ఆదాయమేదీ..?

కోకో గింజల ధర ఆశించని రీతిలో పెరిగినా ఆదాయంలో పెరుగుదల కనిపించడం లేదు. సాధారణంగా ఏటా ఎకరానికి ఐదు క్వింటాళ్ళకు తగ్గకుండా దిగుబడి వచ్చేది. ఇప్పుడు క్వింటాన్నరకు మించి రాలేదు. దీంతో అప్పుడు ధర రూ.240 ఉన్నా, ఇప్పుడు రూ.వెయ్యికి వెళ్ళినా రాబడి ఒకేలా ఉంది. ధర పెరుగుదల ఆశను కల్పిస్తోంది. రూ.500కు తగ్గకుండా ధర ఉంటే ఏటా రెండున్నర లక్షలకు తగ్గకుండా ఆదాయం వచ్చే అవకాశం ఉంది.



- ఆలపాటి సత్యనారాయణ, కోకో రైతు, పెదవేగి

• రాయితీలతో మరింత లబ్ధి



కోకో సాగును ప్రోత్సహించడానికి ప్రభుత్వం రాయితీలు కల్పిస్తోంది. మొక్కల పంపిణీ నుంచి మూడేళ్లపాటు వాటి నిర్వహణ వ్యయాన్ని భరిస్తోంది. మొక్క నాటిన తొలి ఏడాది హెక్టారుకు రూ.12 వేలు, ఆపై రెండేళ్ళపాటు ఏడాదికి రూ.4 వేలు చొప్పున రూ.8 వేలు చెల్లిస్తోంది. అవసరమైన ఇతర యంత్ర పరికరాలను రాయితీపై ఇస్తున్నారు. ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని, సాగు భారాన్ని తగ్గించుకోవాలి.

- ఎం.రత్నమాల, పెదవేగి ఉద్యానశాఖాధికారి


ద్వారకా తిరుమల వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారు హనుమంతుని అవతారంలో దర్శనమిచ్చారు..

నేడు చిన వెంకన్న కల్యాణం

ఆరోగ్యశ్రీ సేవలు బంద్

- జిల్లాలో 31 ప్రైవేటు ఆసుపత్రులు
- బకాయిల చెల్లింపుపై ప్రభుత్వ నిర్లక్ష్యం
- నేటి నుంచి సేవల నిలిపివేతకు యాజమాన్యాల నిర్ణయం
- ప్రభుత్వాసుపత్రుల్లో సేవలు యథాతథం
- ఆందోళనలో జిల్లా ప్రజలు

ఏలూరు క్రైం, మే 21: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ వైద్య సేవలను బుధవారం నుంచి నిలిపివేయనున్నారు. ప్రభుత్వం నుంచి తమకు రావాల్సిన బిల్లులు భారీగా పేరుకుపోవడం.. ఎన్నిసార్లు విడుదల కోరినా సరైన స్పందన లేకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు ఆసుపత్రులు ఈ నిర్ణయం తీసుకున్నాయి. దీనిపై రోగుల్లో ఆందోళన పెరిగింది. పశ్చిమ గోదావరి జిల్లాలో 70 ఆసుపత్రులు, ఏలూరు జిల్లాలో 31 ప్రైవేటు ఆసుపత్రులు, వివిధ రకాల వైద్య సేవలను ఆరోగ్యశ్రీ కింద అందిస్తున్నాయి. ఇప్పటికే ఆసుపత్రిలో చేరిన వారికి ఆరోగ్యశ్రీ అనుమతి పొందిన వారికి యథావిధిగా సేవలు కొనసాగిస్తారు. బుధవారం నుంచి ఆరోగ్యశ్రీ రిజిస్ట్రేషన్ అప్రూవల్ పొందకుండా నిర్ణయాలు తీసుకున్నారు. సాధారణంగా అత్యవసర ప్రమాద, ఇతర కేసులపై ప్రజలు ఎక్కువగా ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్ళడానికి మొగ్గు చూపుతారు. ఈ నేపథ్యంలో ఆరోగ్యశ్రీ కింద ఈ సేవలు లేకపోతే వారి పరిస్థితి అయోమయంగా మారే ప్రమాదం ఉంది. ప్రైవేటు ఆసుపత్రులకు బకాయిలు చెల్లించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందడంతో ఎన్నికల కమిషన్ దీనిపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. మరోవైపు ఏలూరు ప్రభుత్వాసుపత్రితోపాటు జంగారెడ్డిగూడెం, నూజివీడు ఏరియా ఆసుపత్రులు, మరో ఏడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో వివిధ రకాల వ్యాధులకు ఆరోగ్యశ్రీలో చికిత్సలు అందిస్తున్నారు. పీహెచ్‌సీలలో కాన్పులను ఈ పథకం కింద పరిగణించారు. పశ్చిమ గోదావరిలో రూ.40 కోట్లు మేర బకాయిలు ఉన్నాయి. భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నరసాపురం పట్టణాల్లో 70 ఆసుపత్రులు ఆరోగ్యశ్రీలో వైద్యం అందిస్తున్నాయి. ప్రభుత్వం రెండేళ్లుగా బిల్లులు చెల్లించటంలేదు. పలుమార్లు రాష్ట్ర అసోసియేషన్ హెచ్చరికలు జారీచేస్తున్నా, ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. ఎన్నికల ముందైనా ప్రభుత్వం బిల్లులు మజూరు చేస్తుందని, ఆశించారు. కానీ ప్రభుత్వం మొండిచెయ్యి చూపించింది. దీంతో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివెయ్యాలని నిర్ణయం తీసుకున్నారు.




చర్యలు తీసుకున్నాం : ఆరోగ్యశ్రీ ట్రస్టు ఏలూరు జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ఐ.రాజీవ్

ఈ నెల 22వ తేదీ నుంచి ఆరోగ్యశ్రీలో వైద్య సేవలు నిలిపివేస్తున్నట్లు ప్రైవేటు ఆసుపత్రి యాజమాన్యాలు మాకు ఎలాంటి నోటీసు ఇవ్వలేదు. ఒక్క ఆశ్రం ఆసుపత్రి వారు సమాచారం ఇచ్చారు. బుధవారం ఉదయం వెళ్లి వారితో సేవలు కొనసాగించేలా చర్యలు తీసుకుంటాం. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో అన్ని విభాగాలకు ప్రత్యేక వైద్య నిపుణులు ఉన్నారు. అత్యవసర సేవలకు సంబంధించి వైద్యం ఆరోగ్యశ్రీ కింద అందించడానికి ఇక్కడ ఏర్పాటు చేయడానికి ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్‌తో మాట్లాడాం. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే కృష్ణబాబు ఇక లేరు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రాజకీయాల్లో నాలుగు దశాబ్దాలపాటు కింగ్‌మేకర్‌గా వ్యవహరించిన కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే, ప్రముఖ పారిశ్రామికవేత్త పెండ్యాల వెంకట కృష్ణారావు (కృష్ణబాబు(71) ఇక లేరు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం తుదిశ్వాస విడిచారు.



పాఠశాలల మొదటిరోజే పాఠ్య పుస్తకాల పంపిణీ

ఏలూరు రూరల్, మే 21 : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరికి పాఠశాలలు పునఃప్రారంభమయ్యే మొదటిరోజే పాఠ్య పుస్తకాలు అందజేస్తామని డీఈవో ఎస్.అబ్రహం తెలిపారు. ఈ మేరకు మండలాల వారీగా పంపుతున్నట్లు చెప్పారు. మరో ఇరవై రోజుల్లో విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళవారం ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈవోలతో సమావేశమయ్యారు. సెలవులు ముగుస్తుండటంతో నాడు-నేడు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నెల 24న టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు విద్యార్థులను పూర్తిస్థాయిలో సన్నద్ధం చేయాలని ఆదేశించారు. విద్యార్థులందరికి పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం సకాలంలో అందిస్తామన్నారు. ఏపీసీ టి.సోమశేఖర్, డీవైఈవోలు రవిప్రకాశ్, రామన్నదొర, రవీంద్రభారతి, ఎంఈవోలు పాల్గొన్నారు.

కృష్ణబాబు ఇక లేరు

» అనారోగ్యంతో చికిత్స పొందుతూ కన్నుమూత.. నేడు దొమ్మేరులో అంత్యక్రియలు

» ఎన్టీఆర్ పిలుపుతో రాజకీయాల్లో ప్రవేశం.. ఐదుసార్లు కొవ్వూరు ఎమ్మెల్యేగా ఎన్నిక



గతేడాది పుట్టిన రోజు వేడుకల్లో కేక్ కట్ చేస్తూ కృష్ణబాబు

కొవ్వూరు, మే 21 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రాజకీయాల్లో నాలుగు దశాబ్దాలపాటు కింగ్‌మేకర్‌గా వ్యవహరించిన కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే ప్రముఖ పారిశ్రామికవేత్త, దొమ్మేరు జమిందారు పెండ్యాల వెంకట కృష్ణారావు(కృష్ణబాబు)ఇక లేరు. ఆయన వయసు 71 ఏళ్లు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం 11 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఆయనకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. భార్య నాగమణి కొన్నేళ్ల క్రితమే మరణించారు. అప్పటి నుంచి ఇంటికే పరిమితమయ్యారు.

కృష్ణబాబు ప్రస్థానం

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ పిలుపుతో కృష్ణబాబు 1982లో రాజకీయాల్లోకి ప్రవేశించారు. 1983, 1985, 1989, 1994, 2004 సంవత్సరాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1999లో మాత్రం ఓటమి పాలయ్యారు. సుమారు 23 ఏళ్లపాటు ఎమ్మెల్యేగా సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం కొనసాగించారు. అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజా నాయకుడిగా పేరు పొందారు. నిజాయితీతో, నిస్వార్థంగా ప్రజాసేవ చేయడం వల్ల ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో తిరుగులేని నేతగా ఎదిగారు. కొవ్వూరుతోపాటు, పోలవరం, గోపాలపురం, చింతలపూడి, తణుకు నియోజకవర్గ అభ్యర్థుల గెలుపులో కీలక పాత్ర పోషించేవారు. ఉమ్మడి పశ్చిమలో అన్ని నియోజకవర్గాల్లోను అభిమానులను, అనుచరగణాన్ని కలిగి ఉన్నారు. నాలుగు దశాబ్దాలపాటు జిల్లా రాజకీయాలను శాసించారు. మెట్ట ప్రాంతంలోని నాయకులు, కార్యకర్తలు ఆయన మాట జవదాటేవారు కాదు. జిల్లా పరిషత్, జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ల ఎంపికలోనూ కీలకపాత్ర పోషించేవారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనతో కొవ్వూరు ఎస్సీ రిజర్వు కావడంతో ఆయన పోటీకి దూరమయ్యారు. 2012 వరకు క్రియాశీలక రాజకీయాల్లో ఉన్నారు. ప్రస్తుతం వైసీపీ కేంద్రపాలక మండలి సభ్యులుగా కొనసాగుతున్నారు.

ది ఆంధ్రా సుగర్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు పెండ్యాల శ్రీరామచంద్ర వెంకటకృష్ణరంగారావు, అచ్చాయమ్మ దంపతులకు కృష్ణబాబు మూడో సంతానంగా 1953 మే 31న జన్మించారు. ముళ్ళపూడి హరిశ్చంద్రప్రసాద్‌కు సోదరి కుమారుడు. బోళ్ల బుల్లిరామయ్యకు బావమరిది. ది ఆంధ్రా సుగర్స్ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల నరేంద్రనాథ్ చౌదరి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల అచ్యుతరామయ్య(అచ్చిబాబు)లకు సోదరుడు. కృష్ణబాబుకు ఇద్దరు కుమారులు వెంకట్రాయుడు, రవిబాబు (ఎం.డి విభాస్ పాలిమర్స్), కుమార్తె అర్చన ఉన్నారు. కుమారులు పారిశ్రామికవేత్తలు కాగా, కుమార్తె గృహిణి, అల్లుడు ఎస్.రాజీవ్‌కృష్ణ ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడిగా ఉన్నారు.





మాజీ ముఖ్యమంత్రులు వైఎస్ రాజశేఖరరెడ్డి, చంద్రబాబులతో కృష్ణబాబు

నేడు అంత్యక్రియలు

కృష్ణబాబు భౌతికకాయాన్ని హైదరాబాద్ నుంచి కొవ్వూరు మండలం దొమ్మేరులోని వారి నివాసానికి తీసుకువస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం దొమ్మేరులో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

కృష్ణబాబు మరణం తీరనిలోటు

కృష్ణబాబు మరణం జిల్లావాసులకు తీరని లోటని కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి అన్నారు. 'ప్రజలకు ఏ ఆపద వచ్చినా ఆయన వెంటనే స్పందించేవారు. ఆయన హయాంలోనే నియోజకవర్గంలో పంపింగ్ స్కీమ్ ఏర్పాటు చేసి, రైతులకు సాగునీరందించారు. 2003 గోదావరి పుష్కరాలకు కొవ్వూరు పట్టణాన్ని అభివృద్ధి చేశారు. అచ్చాయమ్మ కాలనీలో పేదలకు ఇళ్ళస్థలాలు అందించారు' అని కొనియాడారు. కృష్ణబాబు మృతికి సంతాపంగా బుధవారం నియోజకవర్గంలో వ్యాపారులు, పారిశ్రామికవేత్తలంతా సంతాప దినంగా పాటించాలని కోరారు. సంతాపం తెలిపిన వారిలో కొవ్వూరు మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, రాజేష్, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, ఇమ్మణ్ణి వీర శంకరం, పేరిచర్ల బోసురాజు, కేవీకే రంగారావు, పెనుమాక జయరాజు, పిక్కి నాగేంద్ర సంతాపం తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు ప్రత్యేక బస్సులు

భీమవరం టౌన్, మే 21 : ఈ నెల 24వ తేదీ నుంచి జూన్ ఒకటో తేదీ వరకు జరిగే ఇంటర్మీడియేట్ సప్లమెంటరీ పరీక్షలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు పశ్చిమ గోదావరి జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.వీరయ్య చౌదరి మంగళవారం తెలిపారు. తాడేపల్లిగూడెం డిపోకు చెందిన సర్వీసును మాధవరం నుంచి తాడేపల్లిగూడెం వరకు ఉదయం 7.20కు, మధ్యాహ్నం 1.20కు రెండు బస్సు సర్వీసులు నడుపుతామన్నారు. నరసాపురం డిపోకు చెందిన సర్వీసును యలమంచిలి నుంచి పాలకొల్లు వరకు నడుపుతామన్నారు. ఇది యలమంచిలిలో ఉదయం 8 గంటలకు, మధ్యాహ్నం ఒంటి గంటకు బయలుదేరుతుందని వివరించారు. భీమవరం డిపో సర్వీసు కాళ్ల, ఏటూరుపాడు, దుంపగడప వరకు రెండు బస్సులు నడుపుతామని వీరయ్య చౌదరి చెప్పారు. కాళ్లలో ఉదయం 7.20కు మధ్యాహ్నం 12 గంటలకు, ఏలూరుపాడులో ఉదయం 7.40కు, మధ్యాహ్నం ఒంటి గంటకు సర్వీసులు నడుపుతామన్నారు. నరసాపురం డిపో సర్వీసు ఎల్‌బీచర్ల నుంచి నరసాపురం వరకు ఉదయం 8 గంటలకు, మధ్యాహ్నం 12.30కు, మొగల్తూరు నుంచి నరసాపురం వరకు ఆరగంటకు ఒక సర్వీసు, తణుకు డిపో నుంచి పాలకోడేరు నుంచి భీమవరం వరకు ప్రతి ఆరగంటకు, తాడేపల్లిగూడెం నుంచి ఆచంటకు 40 నిమిషాలకు, భీమవరం డిపో నుంచి పెనుమంట్ర నుంచి వీరవాసరానికి 20 నిమిషాలకు ఒక సర్వీసు నడిపేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. విద్యార్థులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎనిమిది రైళ్లు రద్దు
11 దారి మళ్లింపు

ఏలూరు, తాడేపల్లిగూడెం ప్రయాణికులకు తప్పని తిప్పలు

ఏలూరు క్రైం, మే 20 : దక్షిణమధ్య రైల్వే విజయవాడ డివిజన్ పరిధిలో ట్రాఫిక్ మెయింటినెన్స్ పనులు జరుగుతున్న దృష్ట్యా ఎనిమిది రైళ్లను రద్దు చేయగా, మరో ఎనిమిది రైళ్లు రామవరప్పాడు-విజయవాడ మధ్యలో రద్దు చేశారు. మరో 11 రైళ్లను దారి మళ్లించినట్లు సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ అధికారులు తెలిపారు. ఏలూరు, తాగేపల్లిగూడెం రైల్వే స్టేషన్లలో ఆగాల్సిన రైళ్లు విజయవాడ నుంచి గుడివాడ, భీమవరం టౌన్, నిడదవోలు మీదుగా రాకపోకలు సాగించనున్నాయి. ఏలూరు, తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్లలో రైళ్లు ఎక్కడానికి ఇప్పటికే రిజర్వేషన్లు చేయించుకున్న వారి భీమవరం లేదా విజయవాడ వెళ్లి ఆ రైళ్లను ఎక్కాల్సిన పరిస్థితి తప్పనిసరి అయింది.

రద్దయిన రైళ్లు

07977	బిట్రగుంట	విజయవాడ	మే 27 నుంచి జూన్ 23 వరకూ
07978	విజయవాడ	బిట్రగుంట	మే 27 నుంచి జూన్ 23 వరకూ
17243	గుంటూరు	రాయగడ్డ	మే 27 నుంచి జూన్ 23 వరకూ
17244	రాయగడ్డ	గుంటూరు	మే 28 నుంచి జూన్ 24 వరకూ
17267	కాకినాడ పోరు	విశాఖపట్టణం	మే 27 నుంచి జూన్ 23 వరకూ
17268	విశాఖపట్టణం	కాకినాడ పోర్టు	మే 27 నుంచి జూన్ 23 వరకూ

17237 బిట్రగుంట - చెన్నై సెంట్రల్, 17238 చెన్నై సెంట్రల్ - బిట్రగుంట ఈ రెండు రైళ్లను మే 27 నుంచి జూన్ 31 వరకూ జూన్ 3 నుంచి 7 వరకూ, జూన్ 10 నుంచి 14 వరకూ, జూన్ 17 నుంచి 21 వరకూ రద్దు చేశారు.

దారి మళ్లించిన రైళ్లు

ఏలూరు - తాడేపల్లిగూడెం మీదుగా వెళ్లే రైళ్లను విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, నిడదవోలు మీదుగా దారి మళ్లించారు.

రైలు నెం.	నుంచి వరకు	దారి మళ్లించిన తేదీలు
22643	యర్నాకుళం జంక్షన్ - పాట్నా	మే 27 నుంచి జూన్ 3 వరకూ, జూన్ 10, 17 తేదీలలో
12756	భావనగర్- కాకినాడ పోర్టు	జూన్ 1, 8, 15, 22 తేదీలలో
12509	ఎస్ఎంవీటీ బెంగళూరు - గౌహతి	మే 29, 31, జూన్ 5, 7, 12, 14, 19, 21 తేదీలలో
11019	ముంబై - భువనేశ్వర్ (కొణార్క్)	మే 27, 29, 31, జూన్ 1, 3, 5, 7, 8, 10, 12, 14, 15, 17, 19, 21, 22 తేదీలలో
13351	దన్‌బాద్ - ఆలెపి	మే 27 నుంచి జూన్ 23 వరకూ
18111	టాటా నగర్- యశ్వంత్‌పూర్	మే 30, జూన్ 6, 13, 20 తేదీలలో
12376	జాసిద్ జంక్షన్ - తాంబ్రం	మే 29, జూన్ 5, 12, 19 తేదీలలో
22837	హతాయ్ - యర్నాకుళం జంక్షన్	మే 27, జూన్ 3, 10, 17 తేదీలలో
18637	హతాయ్ - ఎస్ఎంవీటీ బెంగళూరు	జూన్ 1, 8, 15, 22 తేదీలలో
12835	హతాయ్ - ఎస్ఎంవీటీ బెంగళూరు	మే 28, జూన్ 2, 4, 9, 11, 16, 18, 23 తేదీలలో
12889	టాటానగర్ - ఎస్ఎంవీటీ బెంగళూరు	మే 31, జూన్ 7, 14, 21 తేదీలలో

ఏపీఈఏపీ సెట్ ప్రశాంతం

భీమవరం ఎడ్యుకేషన్/ఏలూరు రూరల్/తాడేపల్లిగూడెం రూరల్, మే 21 : ఏపీఈఏపీ సెట్ ఇంజనీరింగ్ పరీక్ష భీమవరంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రంలో మంగళవారం 350 మంది విద్యార్థులకు 337 మంది పరీక్ష రాశారు. విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ పరీక్షా కేంద్రంలో 198కి 189 మంది, డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రంలో 300 మందికి 296 మంది, నర్సాపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రంలో 312 మంది విద్యార్థులకు 309 మంది పరీక్షకు హాజరయ్యారు. ఏలూరులోని సీఆర్‌సీఆర్ ఇంజనీరింగ్, రామచంద్రా ఇంజనీరింగ్, సిద్ధార్థ ఫెస్ట్ కళాశాలలో ఏపీఈఏపీ సెట్ ఇంజనీరింగ్ పరీక్ష నిర్వహిస్తున్నారు. ఉదయం సెషన్‌లో 478కి గాను 465 మంది హాజరుకాగా, 13 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 480 మంది విద్యార్థులకు 463 మంది పరీక్ష రాయగా, 17 మంది గైర్హాజరయ్యారు. తాడేపల్లిగూడెం శశి ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న ఎంసెట్ పరీక్షలకు 400 మంది విద్యార్థులకు గాను 386 మంది పరీక్ష రాయగా, పెద తాడేపల్లి వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో 498 మంది విద్యార్థులకు గాను 487 మంది పరీక్ష రాశారు.

ఉత్తమ ప్రదర్శనగా 'క్షేత్రం'

ముగిసిన కళారంజని జాతీయ స్థాయి నాటిక పోటీలు

భీమవరం అర్బన్, మే 21: కళారంజని జాతీయ స్థాయిలో నిర్వహించిన నాటిక పోటీల్లో ఆరాధన ఆర్ట్స్ గుంటూరు వారి 'క్షేత్రం' నాటిక ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. మూడు రోజుల పాటు భీమవరం శ్రీసోమేశ్వర జనార్ధనస్వామి వారి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కళారంజని జాతీయ స్థాయి నాటిక పోటీల ఫలితాలను కళారంజని నాటక ఆకాడమి నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ వారి 'రాత' నాటిక ద్వితీయ ప్రదర్శనగా, నటీనటుల సమాఖ్య పాలకొల్లు వారి 'అనూహ్యం' నాటిక తృతీయ ప్రదర్శనంగా నిలిచిందన్నారు. జ్యూరి ప్రదర్శనగా 'నాలోన నీవే', ఉత్తమ రచన శిల్పా ఆకురాతి, ఉత్తమ దర్శకత్వం కత్తుల రామమోహన్‌రావు, ఉత్తమ నటుడు మనోహర్ పాత్రధారి జీవీ మనోహర్ (క్షేత్రం), ఉత్తమ నటి సరిత (అమృతహస్తం), ఉత్తమ ప్రతి నాయకుడు కావూరి సత్యనారాయణ (అమృత హస్తం), ఉత్తమ హాస్యనటుడు కేవీఎస్ ప్రకాశరావు (మట్టి పరిమళం), ఉత్తమ క్యారెక్టర్ ఆర్టిస్ట్ ఎంవీ రాజర్షి (అనూహ్యం) ఉత్తమ క్యారెక్టర్ నటి జ్యోతి రాణి (మలి సంధ్య), ఉత్తమ రంగాలంకరణ శ్రీధర్ రాము, (నాలోన నీవే) ఉత్తమ సంగీతం సురభీనాగరాజు (రాత నాటిక), జ్యూరి బహుమతి డేవిడ్ రాజు (మట్టి పరిమళం)లకు అందజేశారు. గుణ నిర్ణేతలుగా గంటా రామ్మోహనరావు, మామిడిపల్లి సత్యనారాయణ, అల్లురామకృష్ణ వ్యవహరించారు. కళారంజని అధ్యక్ష, కార్యదర్శులు నల్లవెంకట కృష్ణ నాగేశ్వరరావు, జవ్వాది దశరధి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మెంటే పూర్ణచంద్రారావు, ఎం.సీతారాం ప్రసాదు పాల్గొన్నారు.



ఉత్తమ ప్రదర్శన 'క్షేత్రం' నాటికకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

నకిలీ డ్రింకుల తయారీ కేంద్రంపై దాడి

ఏలూరు క్రైం, మే 21 : ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ మార్గంలో నకిలీ డ్రింకులను తయారు చేస్తున్న ఒక స్థావరంపై జిల్లా విజిలెన్సు అధికారులు దాడి చేశారు. జిల్లా విజిలెన్సు ఎస్పీ కరణం కుమార్‌కు అందిన సమాచారంతో జిల్లా విజిలెన్స్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐ యూజే విల్సన్, ఫుడ్‌సేఫ్టీ అధికారి రామరాజు, తూనికలు కొలతల అధికారి ప్రశాం త్ వారి సిబ్బందితో మండవల్లి మండలం లోకుమూడి గ్రామంలో కాగిత రామకృష్ణ నిర్వహిస్తున్న కూల్ డ్రింక్ తయారీ స్థావరంపై మంగళవారం దాడి చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఎసెన్స్‌లను ఉపయోగించి డ్రింక్స్ తయారు చేస్తున్నాడని, గడువు తీరిన పానీయాలు అక్కడ ఉన్నట్లుగా గుర్తించారు. అతనిపై కేసు నమోదు చేసి డ్రింకులను సీజ్ చేశారు.



నకిలీ డ్రింకులను స్వాధీనం చేసుకున్న అధికారులు

మద్యం బాటిళ్లు ధ్వంసం

భీమడోలు, మే 21 : అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్న భీమడోలు ఎస్ఈబీ అధికారులు మంగళవారం స్థానిక కార్యాలయం ఎదుట వాటిని ధ్వంసం చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ జేడీ ఆధ్వర్యంలో ఏప్రిల్, మే 14 వరకూ స్వాధీనం చేసుకున్న 67 కేసుల మద్యం, 1,063 బాటిళ్లు, 219.78 లీటర్ల సారా, మొత్తం 20 కేసులకు సంబంధించి 268 లీటర్ల సారాను, కాలంచెల్లిన 432 బీరు బాటిళ్లను కార్యాలయం ముందు ధ్వంసం చేసినట్లు భీమడోలు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ గిరిజా సత్యకుమారి తెలిపారు. స్థానిక కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ అరెస్ట్

టి.నరసాపురం, మే 21 : సారా విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసినట్లు ఎస్ఐ డి.దుర్గామ హేశ్వరరావు తెలిపారు. టి.నరసాపురం పంచాయతీలోని గండిగూడెంలో సారా విక్రయిస్తున్నారనే సమాచారంతో మంగళవారం తన సిబ్బందితో దాడిచేసి మహిళను అరెస్టు చేసి ఆమె వద్ద నుంచి 20 లీటర్లు సారా స్వాధీనం చేసుకుని చింతలపూడి కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ దుర్గామహేశ్వరరావు తెలిపారు.

రాడ్లు, కర్రలతో దాడి..

ముదినేపల్లి, మే 21 : ముదినేపల్లి మండలం ఊటుకూరు గ్రామంలో గూడవల్లి శ్రీనుబాబు ఇంటిపై కొందరు దాడి చేసి అతనిని తీవ్రంగా గాయపర్చారు. పోలీసుల కథనం ప్రకారం ఆ గ్రామంలో ఈ నెల 19వ తేదీ రాత్రి జూనియర్ ఎన్టీఆర్ పుట్టిన రోజు వేడుకల సందర్భంగా ఇరు వర్గాల మధ్య గొడవ జరిగి కొట్లాటకు దారి తీసింది. గొడవను పెద్దలు సర్దుబాటు చేసినప్పటికీ సోమవారం అర్ధరాత్రి శ్రీను బాబు ఇంటిపై సురేష్, చైతన్య, మరి కొందరు రాడ్లు, కర్రల తో దాడి చేసి అతనితోపాటు అతని సోదరులు శివాజీ, శ్రీనివాసరావును తీవ్రంగా గాయపర్చారు. వారిని వెంటనే గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం బందరు తరలించారు. ఆస్పత్రి నుంచి అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి ఏఎస్ఐ పద్మజ దర్యాప్తు చేస్తున్నారు.

నేత్ర పర్వం.. శ్రీవారి ఎదుర్కోలు ఉత్సవం

ద్వారకాతిరుమల, మే 21: బ్రహ్మాండ నాయకుని దివ్యబ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగిన ఎదుర్కోలు ఉత్సవాన్ని మంగళవారం రాత్రి అర్చకులు, పండితులు, అధికారులు, భక్తులతో వేడుకగా నిర్వహించారు. ఇందుకు స్వామివారి నిత్యకల్యాణ మంటపం వేదికైంది. ఆద్యంతం ఉల్లాసంగా ఉత్సాహంగా జరిగిన ఈ ఉత్సవం చూపరులకు నేత్రపర్వమైంది. స్వామివారి కల్యాణానికి ముందు రోజున ఈ ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహించడం సంప్రదా య బద్ధమైంది. ఈ వేడుకకు బ్రహ్మోత్సవాల్లో అధిక ప్రాధాన్యత ఉంది, శ్రీవారి ఆలయ ఆవర ణలో వెండి శేషవాహనంపై ఉభయ దేవేరులతో స్వామిని ఉంచి ప్రత్యేక పుష్పాలం కరణ చేశారు. అనంతరం అట్టహాసంగా నిత్యకల్యాణ వేదిక వద్దకు తెచ్చారు. అనంతరం హారతులిచ్చి అర్చ కులు ఎదుర్కోలు ఉత్సవాన్ని ప్రారంభించారు. మంటపంలో అర్చకులు, అధికారులు, పండి తులు, భక్తులు రెండు జట్లుగా విడిపోయి ఒక జట్టు స్వామివారి గుణగణాలను, ఆయన విశిష్టతను కొనియాడారు. రెండో జట్టు అమ్మ వార్ల గుణగణాలను, వారి కీర్తిని తెలియజేశారు. వివాహం జరిగే ముందు రోజు వధూవరుల తరపు బంధువులు శుభలేఖను పఠించేందుకు జరిపే కార్యక్రమమే ఎదుర్కోలుగా పండితులు చెబుతున్నారు. వెండి శేషవాహనంపై ఉభయదేవేరులతో కొలువుతీరిన చినవెంకన్న క్షేత్రపురవీధుల్లో ఊరేగారు.



ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

నేడు స్వామి వారి కల్యాణం

ద్వారకాతిరుమ లేశుని దివ్య కల్యాణ మహోత్సవానికి దేవ స్థానం సర్వం సిద్ధం చేసింది. చినవెంకన్న కల్యాణాన్ని అంగ రంగ వైభవంగా జరిపేందుకు అనివేటి మంటపంలో ఏర్పాటు చేసిన కల్యాణ మంటపాన్ని సిబ్బంది ముస్తాబు చేస్తున్నారు. పూల అలంకరణ పనులు మంగళవారం రాత్రికి పూర్తవుతాయని ఆలయ ఈఓ వేంద్ర త్రినాదరావు తెలిపారు.



కల్యాణమహోత్సవానికి సిద్ధమవుతున్న వేదిక



తిరువీధి సేవకు వెళ్తున్న శ్రీవారు, అమ్మవార్లు

హనుమద్వాహనంపై శ్రీవారు

శ్రీవారు హనుమద్వాహనాన్ని అధిష్ఠించి మంగళవారం ఉదయం తిరువీధుల్లో ఊరేగారు. చిన్న తిరుమలేశుని వైశాఖమాస దివ్య బ్రహ్మోత్సవాలలో నిత్యం వేద మంత్రోచ్చరణలతో శేషాచల పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరిం చుకున్నాయి. దనుర్బాణాలను ధరించి రామావతారంలో కొలువుతీరిన శ్రీవారు హనుమంత వాహనంపై తిరు వీధుల్లో ఊరేగారు. శ్రీవారి హనుమద్వాహన సేవ నాటి రామరాజ్య వైభవాన్ని పుర వీధుల్లో సాక్షాత్కరిం పజేసింది. దారి పొడవునా భక్తులు స్వామి, అమ్మవార్లకు హారతులు పట్టారు. శ్రీరామలక్ష్మణ సమేత హనుమాన్ అలంకరణలో శ్రీవారు మంగళవారం భక్తులను అను గ్రహించారు. బ్రహ్మోత్సవాల్లో వాహనసేవల్లో భాగంగా శ్రీవారు రోజుకో అలంకారంలో భక్తులకు కనువిందు చేస్తున్నారు. ఈ క్రమంలో లక్ష్మణ సమేతంగా హనుమంతుని భుజస్కందాలపై ఆశీనులైనట్లున్న స్వామివారిని పలువురు భక్తులు దర్శించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

క్రైం కార్నర్

రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం

ఏలూరు క్రైం, మే 21 : రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం ఉందని ఏలూరు రైల్వే ఎస్ఐ డి.నరసింహారావుకు మంగళవారం సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఏలూరు జ్యూట్ మిల్లు సమీపంలోని రైల్వే బ్రిడ్జి కింద సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు ఉన్న వ్యక్తి మృత దేహం ఉన్నట్లు గుర్తించారు. మృతుడు 5.4 అడుగుల ఎత్తు, ఛామన చాయ శరీరం, మాసిన గడ్డంతో ఉన్నాడు. ఆకుపచ్చ రంగు పొట్టి చేతుల టీ షర్టు, నీలం రంగు జీన్ ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతుడు రైలు నుంచి జారి పడ్డాడా, పట్టాలు దాటుతుండగా మృతి చెందాడా.. మరే ఇతర కారణంతో మృతి ఉంటాడా అనే కోణంలో రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని వివరాలు తెలిసిన వారు ఎస్ఐ డి.నరసింహారావు సెల్ నెంబర్ 95020 97672కు సమాచారం అందించాలని కోరారు.

యువకుడి అనుమానాస్పద మృతి

పెనుమంట్ర, మే 23 : ఓ యువకుడు వరి కోసిన చేలో నిర్జీవంగా కనిపించడంతో అనుమాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెనుమంట్ర ఎస్ఐ రవీంద్రబాబు తెలిపారు. భట్లమగుటూరుకు చెందిన పొలమూరి శివ కుమార్(22) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని, ఖాళీసమయంలో కూలీ పని చేసుకుని జీవిస్తున్నాడని తెలిపారు. ఇంటికి ఆలస్యంగా వస్తుండడంతో తండ్రి జీవరత్నం మందలించడంతో పురుగు మందుతాగి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తమకు ఫిర్యాదు చేశారని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పాముకాటుతో మహిళకి అస్వస్థత

పోలవరం, మే 21 : పాముకాటుతో మహిళా వ్యవసాయ కూలి అస్వస్థతకు గురైన సంఘటన ఎల్లండీపేటలో మంగళవారం జరిగింది. వివరాల్లోకి వెళితే తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం హుకుంపేట గ్రామానికి చెందిన మొల్ల అన్నవరం అనే వ్యవసాయ కూలి ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండలం కొవ్వాడ గ్రామంలో పొగాకు కోత పనికి వెళ్లింది. పని చేస్తున్న క్రమంలో పొలంలో పాముకాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురైంది. తోటి కూలీలు ఆమెను ఎల్లండీపేట ప్రభుత్వ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రానికి తరలించగా మెరుగైన చికిత్స కోసం ఆమెను పోలవరం ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

అగ్ని ప్రమాదంలో రూ.2 లక్షల ఆస్తి నష్టం

పెంటపాడు, మే 21: షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగడంతో ఇల్లు అగ్ని ప్రమాదానికి గురైన సంఘటన మంగళవారం అలంపురంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గుబ్బే బాలయ్యకు చెందిన ఇంట్లో ఏసీలో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగి ఇంట్లో ఉన్న సామగ్రి మొత్తం అగ్నికి ఆహుతైంది. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న తాడేపల్లిగూడెం అగ్నిమాపక అధికారి రామారావు నేతృత్వంలో సిబ్బంది మంటలను అదుపుచేశారు. ప్రమాదంలో రెండు లక్షల రూపాయల వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు అగ్నిమాపక అధికారి రామారావు తెలిపారు. గ్రామ వీఆర్వో శాంతి బాధితుల నుంచి వివరాలు నమోదు చేసుకున్నారు.

గోవధకు పాల్పడితే కఠిన చర్యలు

భీమవరం క్రైం, మే 21 : జంతువుల అక్రమ రవాణా, గోవధకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల హెచ్చరించారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు రాష్ట్ర డీజీపీ ఆదేశాలతో పశ్చిమ గోదావరి జిల్లాలో పశు సంరక్షణకు పోలీస్ యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. జంతు సంరక్షణకు సంబంధించి జిల్లా ప్రత్యేక పర్యవేక్షకులుగా దిశా డీఎస్పీ ఎస్.మురళీకృష్ణ వ్యవహరించనున్నారని ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల తెలిపారు. జంతు హింస, రవాణాకు సంబంధించి ప్రజలు నుంచి వచ్చే ఫిర్యాదులు, సమాచారం ఎప్పటికప్పుడు సేకరించి వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.

స్ట్రాంగ్ రూమ్ భద్రతను పరిశీలించిన ఆర్వో


స్ట్రాంగ్‌రూమ్ పరిశీలిస్తున్న ఆర్వో సూర్యతేజ

బుట్టాయగూడెం, మే 21: పోలవరం నియోజకవర్గం స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతను నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజ మంగళవారం పరిశీలించారు. ఏలూరు సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ను ఆయన పరిశీలించారు. ఈవీఎంల వద్ద భద్రత సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. తలుపులకు వేసిన తాళాలు, సీళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీ అనంతరం సందర్శకుల రిజిస్ట్రర్‌లో సంతకం చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

జిల్లాలో విస్తృతంగా పోలీసు తనిఖీలు


వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఏలూరు క్రైం, మే 21: ఎన్నికల కోడ్ జూన్ 4 వరకూ అమలులో ఉండడంతో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో తనిఖీ నిర్వహిస్తున్నారు. ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రాత్రివేళ ముమ్మర గస్తీ నిర్వహిస్తున్నారు. మరోవైపు రోడ్డు ప్రమాదాల నివారణకు జాతీయ రహదారి, రాష్ట్రీయ రహదారిలో వాహన డ్రైవర్లకు ఫేస్ వాష్ నిర్వహిస్తున్నారు. ప్రధాన నగరాల్లో పోలీసు గస్తీ నిర్వహిస్తూ అనుమానాస్పద వ్యక్తులను విచారిస్తున్నారు. ఈవీఎంలను ఏలూరు సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో భద్రపరిచన నేపథ్యంలో మూడంచెల భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశారు. కాలేజీ చుట్టు పక్కలకు ఎవరూ రాకూడదని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. నేర నియంత్రణకు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారు.

వైఎస్ఆర్ కాలనీలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్

ఏలూరు క్రైం, మే 21: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ హెచ్చరించారు. ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు పోణంగి రోడ్డులోని వైఎస్ఆర్ కాలనీలో మంగళవారం కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. అనుమానాస్పదంగా ఉన్నవారిని ప్రశ్నించారు. ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలన చేశారు. సీఐ రాజశేఖర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల అనంతరం ముందస్తు చర్యల్లో శాంతిభద్రతల పరిరక్షణకు కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నామన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా ప్రజా శాంతికి భంగం కల్గినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కొబ్బరికి గిట్టుబాటు ధర కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఏలూరు టూటౌన్, మే 21: కొబ్బరి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ కొబ్బరి రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అన్నేభవన్‌లో రైతు సమస్యలపై మంగళవారం సమావేశం నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ కొబ్బరి కాయలకు కనీస ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వెయ్యి కొబ్బరి కాయలకు రూ.8వేలు ధర మాత్రమే వస్తుందన్నారు. వీటిని కొయ్యడానికే రూ.3వేలు ఖర్చవుతుందన్నారు. ఇవి కాక తెగుళ్ల వలన దిగుబడులు తగ్గిపోతున్నాయన్నారు. రాష్ట్రం నుంచి ఎగుమతులు కూడా తగ్గాయన్నారు. విదేశీ కొబ్బరి ఉత్పత్తులు దిగుమతులు కావడం కూడా ధర పడిపోవడానికి ఒక కారణం అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. కొబ్బరి అధికంగా సాగు చేసే కోనసీమ, ఉమ్మడి పశ్చిమగోదావరి, అనకాపల్లి, విజయనగరం, కాకినాడ ప్రాంతాల్లో రైతులు నష్టాల పాలయ్యారని అన్నారు. నాఫెడ్, ఆయిల్ ఫెడ్ ద్వారా కొబ్బరి కేంద్రాలు తెరచి కొనుగోలు చేయాలన్నారు. కనీస మద్దతు ధర రూ.15వేలు ఇవ్వాలన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛ భారత్ బృందం పర్యటన


సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న బృందం

టి.నరసాపురం, మే 21: మండలంలోని ఏపీగుంట, కేతవరం గ్రామాల్లో స్వచ్ఛభారత్ బృందం మంగళవారం పర్యటించింది. మరుగుదొడ్లను, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. పోలవరం ఎంపీడీవో జి.శ్రీను మాట్లాడుతూ బహిరంగ మల విసర్జన రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అధికారులు మరుగుదొడ్ల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాన్నారు. పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. పోలవరం, టి.నరసాపురం విస్తరణాధికారులు శ్రీనివాసరావు, రాంప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు కె.గంగరాజు, బి.రామకృష్ణ, గ్రామ కార్యదర్శులు కృష్ణ శ్రీనివాస్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవం


వధూవరులుగా స్వామి, అమ్మవార్లు

ఏలూరు కల్చరల్, మే 21: శనివారపుపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామి వారికి సుప్రభాతసేవ అనంతరం అభిషేకం నిర్వహించారు. తదుపరి అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీవారిని వధూవరులుగా అలంకరించారు. బుధవారం రాత్రి స్వామివారి దివ్య కల్యాణం నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం


ప్రత్యేక అలంకరణలో నృసింహస్వామి

ఏలూరు కార్పొరేషన్, మే 21 : పడమర వీధి అళహ సింగరప్పస్వామి ఆలయం వద్ద మంగళవారం లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామిని వధూవరులుగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో లక్ష్మీ నరసింహస్వామి దివ్య కల్యాణం జరుగుతుందని కమిటీ సభ్యులు సుంకర ప్రవీణ్‌రాయల్ తెలిపారు.

కోటదిబ్బ ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఆలయ ధర్మకర్త చిందా రాజు మంగళవారం భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. తొలుత స్వామివారికి భక్తులు సామూహికంగా తమలపాకులు, సింధూరంతో అర్చనలు జరిపారు. హనుమాన్‌చాలీసా పారాయణ నిర్వహించారు.

ఘనంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి జన్మదినం



నిడమర్రు, మే 21: అడవికొలను నాగులమిల్లి లక్ష్మీనరసింహస్వామి జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామి వారికి విశిష్ట పూజా కార్యక్రమాలు ఆలయ అర్చకులు శ్రీనివాసులు రాంబాబు నిర్వహించారు. తదనంతరం ఆలయ ప్రాంగణంలో విష్ణుసహస్ర నామ పారాయణం అన్న సమారాధన నిర్వహించారు.

రాచూరు పల్లాలమ్మ ఊరేగింపు

ఉంగుటూరు, మే 21: రాచూరు గ్రామ దేవత పల్లాలమ్మ జాతర ఉత్సవాలు వైభవంగా జరిగాయి. సోమవారం రాత్రి గరగ నృత్యాలతో బాణసంచా, తీన్‌మార్ డప్పులతో భారీ ఊరేగింపు జరిపారు.మంగళవారం అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు.

హనుమజ్జయంతి ఆహ్వాన పత్రికలు విడుదల

పెదపాడు, మే 21: అప్పనవీడు అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాల ఆహ్వాన పత్రికలను మంగళవారం విడుదల చేశారు. తొలుత ఆహ్వాన, గోడపత్రికలను ప్రధానార్చకులు మారేపల్లి సీతారామానుచార్యులు, గొట్టిపాళ్ళ శ్రీనివాసాచార్యులు స్వామి వారి పాదాల వద్ద ఉంచి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ నెర్సు భూషణం, అప్పన దుర్గాప్రసాద్, చలమలశెట్టి రమేష్‌బాబు, ఈవో కూచిపూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సుమారు 200 మంది అన్న ప్రసాదం స్వీకరించినట్లు ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

శ్రీవారి సేవలో ఎంపీ మోపిదేవి

ద్వారకా తిరుమల, మే 21: చిన్న తిరుమలేశుని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ మంగళవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ముఖమండపంలో పండితుల నుంచి వేదాశీర్వచనాన్ని, ప్రసాదాలను స్వీకరించారు.

నిర్లక్ష్యానికి పదేళ్లు..!


జీలుగుమిల్లిలో పదేళ్ల క్రితం నిర్మాణం మధ్యలో వదిలేసిన భవనం

గిరిజన ప్రాంతంలో విద్యుతోపాటు విద్యా వనరుల కేంద్ర భవనంపై నిర్లక్ష్యం అలముకుంది. దశాబ్ద కాలంగా మండల కేంద్రంలో తహసీల్దారు, ఎంపీడీవో, ఏవో కార్యాలయాల సమీపంలో నిర్మిస్తున్న ఎంఆర్‌సీ భవన నిర్మాణం నిలిచిపోయింది. అప్పట్లో రూ.4 లక్షలతో భవన నిర్మాణం చేపట్టారు. కాంట్రాక్టర్లు, అధికారుల మధ్య సమన్వయ లోపంతో భవన నిర్మాణం నిలిచిపోయింది. ప్రస్తుతం ఎంపీడీవో కార్యాలయంలోని గదిలో ఎంఆర్‌సీ భవనం కార్యకలాపాలు సాగుతున్నాయి. ఇద్దరు ఎంఈవోలు, మండలంలోని పాఠశాలల దస్త్రాలు, విద్యార్థులకు అందించే పాఠ్య పుస్తకాలు, ఇతర సామగ్రి ఆ గదిలో ఉంచాల్సి వస్తోంది. - జీలుగుమిల్లి

మహిళా సంఘంలో పంచాయతీ..!


నాలుగేళ్లుగా ముందుకు సాగని సచివాలయ భవన నిర్మాణం

పరింపూడి పంచాయతీ కార్యాలయానికి భవనం లేక ఒక మహిళా సంఘం భవనంలోనే కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. భవనం శిథిలావస్థకు చేరడంతో అధికారులు పంచాయతీ కార్యాలయాన్ని ఒక మహిళా సంఘం భవనంలో ఏర్పాటు చేశారు. వైసీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి పరింపూడి పంచాయతీ (కొయ్యలగూడెం) నాలుగు సచివాలయాలుగా విభజన చేసింది. పంచాయతీ కార్యలయం వద్ద ఒక ఒక సచివాలయాన్ని వివిధ ప్రాంతాల్లో మరో మూడు సచివాలయాల్ని నిర్మించడానికి శంకుస్థాపనలు చేశారు. ఈ సచివాలయాలు పూర్తి స్థాయిలో నిర్మాణం కాలేదు. - కొయ్యలగూడెం

రోడ్డుపై కోళ్ల వ్యర్థాలు..!


రోడ్డుపక్కన పడవేసిన కోళ్ల వ్యర్థాలు

రోడ్డుపక్కన కోళ్ల వ్యర్థాలు పడవేయడంతో దుర్వాసనతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ధర్మాజిగూడెం - బోగోలు రహదారిపై స్థానికులు చెత్తాచెదారంతో పాటు కోళ్ల వ్యర్థాలు పడేస్తున్నారు. ఆ మార్గంలో దుర్వాసన తట్టుకోలేకపోతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. బోగోలు, రంగాపురం వెళ్లడానికి ధర్మాజిగూడెం మూడురోడ్ల కూడలివద్ద ప్రయాణికులు వేచి ఉండే ప్రాంతంతో పాటు ప్రధాన రహదారిపై కూడా స్థానికులు కోళ్ల వ్యర్థాలు, చెత్తాచెదారం వేస్తున్నారని బస్సులు, ఆటోల కోసం వేచిఉండే ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. - లింగపాలెం


మధ్యాహ్నం ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా ఉన్న రహదారి


సాయంత్రం మబ్బులతో చల్లబడిన వాతావరణం

ఎండ.. ఉక్కపోత.. చిరుజల్లు..

ఏలూరు రూరల్, మే 21: ఎండ, మబ్బులు, చిరుజల్లులతో విభిన్న వాతావరణ పరిస్థితులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావంతో వాతావరణంలో మార్పులు కనిపిస్తున్నాయి. ఆకాశం మేఘావృతమైనా ఎండ కాస్తుంది. ఉదయం నుంచి ఎండ తీవ్రత గణనీయంగా పెరిగింది. బయటకు వస్తే చాలు ఎండ చుర్రుమనిపించింది. మధ్యాహ్నం, సాయంత్రం చిరుజల్లులు పడ్డాయి. ఉక్కపోత అధికమైంది. గాలివీయక, ఉక్కపోతతో ప్రజలు సతమతమవుతున్నారు. సాయంత్రం 6 గంటల వరకు అదేవిధంగా ఉండగా, ఆ తరువాత ఆకాశంలో దట్టంగా మబ్బులు అలుముకుని గాలులు వీచాయి. వర్షం కురవకపోయినా వాతావరణం కొంతమేర చల్లబడడంతో ప్రజలు సేదతీరారు. రెండురోజులుగా సాయంత్రం వేళ ఆకాశంలో మేఘాలు ఆవరిస్తున్నాయి. గంటపాటు మబ్బులు అలా మురిపించి చినుకులు రాలకుండా ప్రజలను నిరాశకు గురి చేశాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఠారెత్తించే ఎండతో సతమతమయ్యారు. చుట్టుపక్కల గ్రామాల్లో ఏదో సమయంలో వర్షాలు పడుతున్నా నగరంలో చిరుజల్లు కూడా కురవక ప్రజలు నిరాశ చెందుతున్నారు.

కుక్కునూరులో మోస్తరు వర్షం

కుక్కునూరు: మండల కేంద్రంలో మంగళవారం మోస్తరు వర్షం కురిసింది. గాలి ధుమారం వచ్చిన అనంతరం వర్షం కురిసింది. వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలకు వర్షంతో కాస్త ఊరట కలిగింది.


సర్పంచ్‌ను నిలదీస్తున్న గ్రామస్తులు

ఉపాధి హామీ కూలీల నిరసన

ఏలూరు రూరల్, మే 21: చేయడానికి పనులు లేవు. పని చేయకుంటే పూట గడవదు. అలాంటి వారికి ఉపాధిహామీ పథకం వరంగా మారింది. ఉద్యోగి నుంచి దినసరి కూలీ వరకు పొట్టకూటికోసం పనులకు వెళతున్నారు. ఏలూరు రూరల్ మండలం కోమటిలంకలో అడిగిన వారికి పని కల్పించలేదంటూ స్థానికులు మంగళవారం ఫీల్డ్ అసిస్టెంట్, సర్పంచ్‌ను నిలదీశారు. వేసవికాలం ఉదయం పూట పనులు కల్పించాల్సి ఉండగా, అయినవారికే పనులు కల్పిస్తున్నారంటూ సర్పంచ్, ఫీల్డ్ అసిస్టెంట్‌ను నిలదీశారు. సమయం ముగిసినా పనులు చేయిస్తున్నారంటూ మండిపడ్డారు. స్థానికేతరులకు సైతం ఉపాధి పనులు కల్పిస్తున్నారని ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. సుమారు మూడు కిలోమీటర్ల మేర దూరంలో పనులు కల్పించడంపై మండిపడ్డారు. వృద్ధులు, మహిళలను సైతం ఎండలో నడిపిస్తున్నారని, పని ప్రదేశంలో సరైన సౌకర్యం కల్పించడం లేదంటూ నిలదీశారు. విషయం తెలుసుకున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు అక్కడకు చేరుకుని అడిగిన ప్రతి ఒక్కరికి పనులు కల్పిస్తామంటూ హామీ ఇచ్చారు.

ఉపాధి పనులు పరిశీలన


కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ

ఏలూరు రూరల్, మే 21: రూరల్ మండలంలోని పలు ప్రాంతాల్లో ఉపాధి పనులను డ్వామా పీడీ ఎ.రాము మంగళవారం పరిశీలించారు. మునుకోడు, గుడివాకలంక గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. పనుల సమయంలో కూలీలకు తాగునీరు, మెడికల్ కిట్, ఎండ తీవ్రత నుంచి కాపాడుకోవడానికి అందుబాటులో టార్పాలిన్‌లతో కూడిన షెడ్లు ఉన్నాయో? లేదోనని పరిశీలించారు. వేతనదారులందరూ ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు పనులు చేపట్టాలని, వడదెబ్బకు గురికాకుండా అందరూ జాగ్రత్తగా ఉండాలని కోరారు. పని అడిగిన ప్రతి కుటుంబానికి పనులు కల్పించాలని ఏపీవోకు సూచించారు.


ఏలూరు విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న బాలబాలికలు


లింగపాలెం గ్రంథాలయంలో విద్యార్థులు

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

ఏలూరు టూటౌన్, మే 21: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని విద్యార్థులు ప్రతీ రోజు గ్రంథాలయానికి వెళ్లాలని ఉపాధ్యాయురాలు ఎం.జగదీశ్వరి అన్నారు. మహిళా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం మంగళవారం నిర్వహించారు. విద్యార్థులకు చెస్, క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. చెస్ పోటీల్లో ఎస్.కార్తీక్ ప్రథమ, ఐ.ప్రణీత ద్వితీయ బహుమతి సాధించారు. క్యారమ్ బోర్డు పోటీలో ఐ.తరుణ్, పి.సంజన విజేతలుగా నిలిచారు.

● లింగపాలెం: ధర్మాజిగూడెం, లింగపాలెంశాఖా గ్రంథాలయాల్లో ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. స్పోకెన్ ఇంగ్లీష్, జనరల్ నాలెడ్జ్, క్రీడలు, హస్తకళలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులలో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు తరగతులు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారులు సీహెచ్.వెంకటరమణ, లతీఫ్ తెలిపారు. వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

రైతు సంఘ నేత కొల్లి వర్ధంతి


సీపీఐ కార్యాలయం వద్ద నేతల నివాళి

కామవరపుకోట, మే 21: సీపీఐ సీనియర్ నేత, ఏపీ రైతు సంఘం నాయకులు కొల్లి నాగేశ్వరరావు వర్ధంతిని స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద నిర్వహించారు. కొల్లి నాగేశ్వరరావు చిత్రపటానికి సీపీఐ మండల కార్యదర్శి టీవీఎస్.రాజు పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీకి, రైతులకు నాగేశ్వరరావు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో శెట్టి నాగ బాలాజీ, నల్లమోతుల శ్రీనివాసరావు, గదుల రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో కళాశాల అధ్యాపకురాలు మృతి


శ్రీలక్ష్మి(ఫైల్)

బుట్టాయగూడెం, మే 21: బుట్టాయగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర అధ్యాపకురాలు పరిమి శ్రీలక్ష్మి(49) మంగళవారం తెల్లవారుజామున హైదరాబాద్‌లో గుండెపోటుతో మృతిచెందారు. మంగళవారం అంత్యక్రియలు జరగనున్న నేపథ్యంలో కళాశాల ప్రిన్సిపాల్ మణీంద్రరావు, వైస్ ప్రిన్సిపాల్ మద్రి వెంకటేశ్వరావు విద్యార్థులు శ్రీలక్ష్మీ కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

ఎన్డీఏ కూటమి విజయం ఖాయం

కామవరపుకోట, మే 21 : కేంద్రం, రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి విజయం సాధిస్తుందని ఏఎంసీ మాజీ చైర్మన్ కోనేరు వెంకట సుబ్బారావు అన్నారు. మంగళవారం పలుచోట్ల ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఘంటా సుధీర్‌బాబు మాట్లాడుతూ చంద్రబాబు సీఎం అవుతారని, మోదీ పీఎం అవుతారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఎన్నికల్లో వారికే అధిక సంఖ్యలో ఓట్లు పడ్డాయన్నారు. నెక్కలపు సూర్యనారాయణ, నెక్కలపు గంగాధరరావు, నూతి రాటాలు, బొబ్బిలి డాన్ దివాకర్‌తోపాటు మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజలకు అధికారులు సేవలందించాలి


వైద్యసేవలను వివరిస్తున్న డాక్టర్ చక్రధర్

పెదపాడు, మే 21: విధి నిర్వహణలో భాగంగా అధికారులు ప్రజలకు సేవలందించాలని మండల విస్తరణాధికారి సూర్య కుమార్ అన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లుగా నియమితులైన ఆఫీసర్ల బృందం పెదపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం సందర్శించింది వారికి డాక్టర్ చక్రధర్ వైద్యశాలలో అందజేస్తున్న వైద్య సేవలను వివరించారు. ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు హాల్ టికెట్ల జారీ

ఉంగుటూరు, మే 21: నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 24 జరిగే సప్లిమెంటరీ పరీక్షలకు హాల్ టిక్కెట్లు జారీ చేసినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బి.వి.శ్రీనివాస్ తెలిపారు. నూతన విద్యా సంవత్సరం ప్రవేశాలు ప్రారంభమవుతాయన్నారు.

పెదపాడులో సీడ్ ప్రాసెసింగ్ యూనిట్ తనిఖీ

పెదపాడు, మే 21: సీడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ని జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ మంగళవారం తనిఖీ చేశారు. వరి విత్తనాల అమ్మకపు లైసెన్స్, రికార్డులను పరిశీలించారు. తూకం, విత్తనాలు మొలక శాతం, నాణ్యతా ప్రమాణాలను దృష్టిలో ఉంచుకుని విక్రయాలు జరపాలని ప్రాసెసింగ్ యూనిట్ సిబ్బందికి తెలిపారు.

మరుగుదొడ్లు నిర్మాణంపై ఆరా

జీలుగుమిల్లి, మే 21: స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణంపై ఆరా తీయాలని ఎంపీడీవో కెఎం.మంగతాయారు అన్నారు. ఈవోపీఆర్డీ నిఖిల్‌కుమార్, గ్రామ కార్యదర్శులతో మంగళవారం చర్చించారు. గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసిన వారికి ఇతర పేద కుటుంబాల వారు నిర్మించే మరుగుదొడ్ల వివరాలు సేకరించలన్నారు.

అంపశయ్యపై ఆరోగ్యశ్రీ పథకం

టీడీపీ రాష్ట్ర అధికారప్రతినిధి దాసరి శ్యామ్‌చంద్రశేషు

చింతలపూడి, మే 21: రాష్ట్రంలో గడిచిన ఐదేళ్లుగా ఆరోగ్యశ్రీ పథకం అంపశయ్యపై ఉందని, టీడీపీ నేత, రాష్ట్ర అధికారప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు విమర్శించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గడిచిన సంవత్సర కాలంగా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోతే వైద్యసేవలు నిలిపివేస్తామని పలుమార్లు డెడ్‌లైన్ విధించినా ముఖ్యమంత్రి నుంచి కనీస స్పందన లేకపోవడం, పేదల ఆరోగ్యంపై ముఖ్యమంత్రికి ఉన్న చిత్తశుద్ధి తెలియచేస్తోందన్నారు. ఆరోగ్యశ్రీని అనారోగ్యశ్రీగా మారుస్తూ దాదాపు 1500 కోట్లు ఆసుపత్రులకు చెల్లించకుండా పేదలకు వైద్యాన్ని దూరం చేస్తున్నారని ఆరోపించారు. మొదటి నుంచి పేదల ఆరోగ్యం అంటే ఆయనకు ఏమాత్రం చిత్తశుద్ధి లేదని, కరోనా సమయంలో కనీస జాగ్రత్తలు తీసుకోకుండా అనేకమంది చనిపోవడానికి కారణమయ్యారన్నారు. రూ.వెయ్యి రూపాయలు దాటితే ఆరోగ్యశ్రీ వర్తిస్తుందని చెప్పి కోట్లాది రూపాయల ప్రకటనలు చేయడం తప్ప వాస్తవంగా ఎక్కడా అమలు కావడం లేదన్నారు. వేలల్లో జబ్బులు ఆరోగ్యశ్రీ పట్టికలో చేర్చినప్పటికి ముఖ్యమైన క్యాన్సర్, బ్రెయిన్ సమస్యలు ఆరోగ్యశ్రీలో వైద్యం చేసుకోవడానికి పేదలకు అవకాశం లేదని తెలిపారు. కేంద్రం ఇచ్చిన నిధులతో సోకులు చేయడం తప్ప సరైన పద్ధతి అవలంబించడం లేదన్నారు. వర్షాకాలంలో అంటువ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దీనిపై ఇంతవరకు సమీక్ష కూడా చేయలేదన్నారు. టీడీపీ ప్రభుత్వం రాగానే ఆరోగ్యశ్రీని మెరుగైన సేవలతో పేదలకు సరైన వైద్యం అందించే పరిస్థితులు రాష్ట్రంలో రాబోతున్నాయన్నారు. ఈసీ తగు చర్యలు తీసుకుని పెండింగ్ బకాయిలు చెల్లించే విధంగా ఆదేశాలు ఇవ్వాలని ఆయన కోరారు.

ఆరోగ్యశ్రీ నిలిపివేయకుండా చర్యలు తీసుకోవాలి

ఏలూరు టూటౌన్, మే 21: ఆరోగ్యశ్రీ సేవలు నిలిపి వేయకుండా ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని కాపు ఉద్యమ నాయకులు పులి శ్రీరాములు డిమాండ్ చేశారు. ఆసుపత్రులకు బకాయిలు చెల్లించలేదని ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తామనడం భావ్యం కాదన్నారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులు చెల్లించాలన్నారు. ఆరోగ్యశ్రీ సేవలు నిలిపి వేస్తే పేదలకు అన్యాయం జరుగుతుందని ఆ పరిస్థితి రాకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.


ఏలూరులో రాజీవ్ గాంధీ చిత్రపటం వద్ద నేతల నివాళి


పోలవరంలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు


భీమడోలులో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



చింతలపూడిలో కాంగ్రెస్ నాయకుల నివాళి

సాంకేతిక పరిజ్ఞానం విస్తరించిన

రాజీవ్ గాంధీ

వర్ధంతి కార్యక్రమాల్లో కాంగ్రెస్ నేతల నివాళి

ఏలూరు కార్పొరేషన్, మే 21: దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం నివాళులర్పించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశంలో టెక్నాలజీ రంగంలో ఇంత ముందులో మనదేశం ఉండడానికి రాజీవ్ ఎంతో కృషి చేశారన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు లంకా రామ్మోహన్, ప్రతాప సుబ్రహ్మణ్యశర్మ, యోహన్‌రాజు, కె.ఎస్.ఎన్.మూర్తి, నల్లగట్ల అనీల్‌కుమార్, వెంకటేశ్వరరావు, సూర్యనారాయణ, సుంకర సుబ్బారావు పాల్గొన్నారు.

● పోలవరం: దేశం కోసం ముష్కరుల చేతిలో అమరులైన త్యాగజీవి రాజీవ్ గాంధీ అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షురాలు ముచ్చిక సీత అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజీవ్, తల్లి ఇందిర కుటుంబం మొత్తం దేశం కోసం అనుక్షణం పాటుపడిన వారేనన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

● భీమడోలు: రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు యర్రంశెట్టి ఏడుకొండలు ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. రాజీవ్ గాంధీ చేసిన సేవలను కొనియాడారు. ఐటి రంగంలో యువతకు ఉద్యోగాలు కల్పించిన గొప్ప నాయకుడని, 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించి యువతను ప్రజాస్వామ్యంలో భాగస్వాములను చేసిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● కుక్కునూరు: ఇసుకపాడులో కాంగ్రెస్ నాయకులు రాజీవ్‌గాంధీ వర్ధంతి నిర్వహించారు. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణత్యాగం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు గజ్జి రాజులు, మడకం వీరయ్య, రఘు, నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడి: స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ వర్ధంతి కార్యక్రమం మండలశాఖ అధ్యక్షుడు విస్సంపల్లి సుందర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన పరిపాలనలో ఎలక్ట్రానిక్ విప్లవం తీసుకువచ్చి దేశంలో సాఫ్ట్‌వేర్, ఐటీ రంగం అభివృద్ధికి కృషిచేశారన్నారు. కాంగ్రెస్ నాయకులు కొనకళ్ల కృష్ణమూర్తి, సాదరబోయిన వరలక్ష్మి, సంకుప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.



గ్రోమోర్ ఎరువుల కొనుగోలుతో లక్కీడిప్ విజేతలకు టీవీఎస్ మోపెడ్ తాళాలిస్తున్న రీజనల్ బిజినెస్ హెడ్ కేఎస్ఆర్ చక్రవర్తి

ఘనంగా గ్రోమోర్ రైతు సంబరాలు

విజయవాడ(భవానీపురం), మే 21 : ఏలూరులోని స్థానిక రామాంజనేయ మెన్యూర్స్‌లో కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వారి గ్రోమోర్ రైతు సంబరాల కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. భారతదేశంలో సుప్రసిద్ధ అగ్రి సొల్యూషన్స్ ప్రధాత కోరమాండల్ ఇంటర్నేషనల్ వారు గ్రోమోర్ రైతు సంబరాలు నిర్వహించారు. అందులో భాగంగా గ్రోమోర్ ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు లక్కీ డ్రాలో విజేతలుగా నిలిచిన రైతులకు ఆరు టీవీఎస్ మోపెడ్‌లను అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రీజనల్ బిజినెస్ హెడ్ కేఎస్ఆర్ చక్రవర్తి మాట్లాడుతూ పీఎంకేఎస్‌కే ద్వారా మట్టి నమూనా పరీక్షలు చేసి ఎరువుల యాజమాన్యాన్ని కూలంకషంగా వివరించారు. గత రబీ సీజన్ లాగానే ఈ ఖరీఫ్ సీజన్‌లో కూడా గ్రోమోర్ రైతు సంబరాలు స్కీమ్ మొదలు పెట్టబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరమాండల్ డీజీఎం ఎం.సచ్చిదానందరెడ్డి, నానో- డీఏపీ బిజినెస్ మేనేజర్ స్వరూప్, సీనియర్ అగ్రోనమిస్ట్ పి.సూర్యనారాయణ, మార్కెటింగ్ మేనేజర్ కె.రమేష్, అగ్రోనమిస్ట్ చైతన్యలు పాల్గొన్నారు.

సైలెంట్ ఓటింగ్‌పై అందని అంచనాలు

తమదే మెజారిటీ అంటూ ఇరు పార్టీల ధీమా

చాట్రాయి, మే 21: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో నూజివీడు నియోజక వర్గం పరిధిలోని చాట్రాయి మండలంలో తమకే మెజారిటీ వస్తుందని వైసీపీ, టీడీపీ ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఈసారి ఓటర్లు సైలెంట్‌గా ఉండటంతో ఇరు పార్టీల్లోని నాయకులు ఒక అంచనాకు రాలేని పరిస్థితి నెలకొంది. ఈ మండలంలో వచ్చే మెజారిటీపైనే వైసీపీ, టీడీపీ అభ్యర్థుల భవితవ్యం ఆధార పడి ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మండలంలో 2009 అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రమే టీడీపీకి తొలిసారి 185 ఓట్లు మెజారిటీ రావటం గమనార్హం. అప్పుడు టీడీపీ అభ్యర్థి చిన్నం రామకోటయ్య స్థానికుడు కావటం కలిసొచ్చింది. తరువాత 2014లో వైసీపీకి 2700 ఓట్లు, 2019లో 3300 ఓట్లు మెజారిటీ వచ్చి మేకా ప్రతాప్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. మండలంలో పోతన పల్లి, బూరుగ్గూడెం, పర్వతాపురం గ్రామాల్లో అధిక శాతం ఓట్లు వైసీపీకి పడు తుండటంతో వరుసగా మెజారిటీ సాధిస్తున్నారు. రాజకీయాలకతీతంగా పేద లందరికి పింఛన్లు, సంక్షేమ పథకాలు అందించటం వలన ఈసారి కూడా మండలంలో 3 వేలు పైగా మెజారిటీ తథ్యమని వైసీపీ నాయకులు నమ్ముతు న్నారు. 5 ఏళ్ళ వైసీపీ అవినీతి, అస్తవ్యస్త పాలనతో ప్రజలు విసుగు చెందారని, అభివృద్ధిని పూర్తిగా విస్మరించటం వలన రాష్ట్రం వెనుకబడిపోయిందని, అధిక ధరలు పన్నుల భారంతో పేదలు జీవన ప్రమాణాలు దిగజారాయని ఫలితంగా ప్రజలు మార్పు కోరుకుంటున్నారని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు అంటున్నారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలు, రూ. 4 వేలు పింఛన్‌కు ప్రజలు ఆకర్షితులై సైకిల్ గుర్తుకు అధికంగా ఓట్లు వేశారని కూటమి శ్రేణులు అంటున్నాయి. వైసీపీకి గట్టి పట్టు ఉన్న పోతనపల్లి, బూరుగ్గూడెం, పర్వతాపురం గ్రామాల్లో కూడా ఈసారి టీడీపీకి ఓట్లు పెరగటం, టీడీపీకి పట్టు ఉన్న గ్రామాల్లో ఎక్కువ మెజారిటీ వచ్చే అవకాశం ఉండటం వలన మండ లంలో సంతృప్తికర ఫలితాలు వస్తాయని తెలుగుదేశం శ్రేణులు ఆశిస్తున్నాయి. ఈసారి నూజివీడు బరిలో వైసీపీ అభ్యర్థి మేకా ప్రతాప్, కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి మధ్య హోరాహోరీ పోరు జరిగిందనేది అందరూ అంగీకరి స్తున్న వాస్తవం. మండలంలో 18 గ్రామాల పరిధిలో మొత్తం 43,322 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 21,667 మంది, స్త్రీలు 21,654 మంది, థర్డ్ జండర్ ఒకరు ఉన్నారు. వీరిలో స్త్రీలు 19,264 మంది, పురుషులు 19,713 మంది, మొత్తం 38,977 మంది, 89.97 శాతం మంది ఓటు హక్కు వినియోగిం చుకున్నారు. అధిక ఓటింగ్ తమకే అనుకూలమని కూటమి నాయకులు విశ్లేషి స్తున్నారు. జూన్ 4న ఫలితాల వచ్చే వరకు ఇరు పార్టీల నాయకుల్లో తీవ్ర ఉత్కంఠ కొనసాగనున్నది.

సేద తీరేందుకు వెళ్ళిన తెలుగు తమ్ముళ్ళు!

నూజివీడు, మే 21: ఎన్నికల్లో కష్టపడిన నూజివీడు తెలుగు తమ్ముళ్ళు పోలింగ్ పూర్తి అయిన దరిమిలా సేదతీరేందుకు హుషారుగా ఒక బ్యాచ్ గోవా పర్యటనకు వెళ్ళగా, మరో బ్యాచ్ ఆగ్రా, ఢిల్లీ పర్యటనకు వెళ్ళారు. ఈ రెండు బృందాలు 25వ తేదీన తిరిగి నూజివీడు వచ్చి 4వ తేదీన జరిగే కౌంటింగ్ కార్యక్రమానికి సన్నద్ధం కానున్నాయి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముదినేపల్లి, మే 21 : విద్యుత్ లైన్ల మరమ్మతులకు బుధవారం ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ముదినేపల్లి మండలం చిగురుకోట సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏఈ పి.రవికుమార్ తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గుర్తించాలని కోరారు.

ఎన్నికల సంఘం ఆదేశాల అమలు తప్పదు

ముదినేపల్లి, మే 21 : పెట్రోల్ బంకుల్లో డీజిల్, పెట్రోలు లూజు అమ్మకాలపై నిషేధం ఎన్నికల కోడ్ ముగిసే వరకు అమలులో ఉంటుందని, ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలను పాటించాల్సిందేనని జిల్లా పౌర సరఫరాల అధికారి సత్యనారాయణరాజు స్పష్టం చేశారు. ఎన్నికల సందర్భంగా కొన్ని అవాంఛనీయ ఘటనలు జరిగిన నేపథ్యంలోనే పెట్రోలు బంకుల్లో బాటిల్స్, డబ్బాల్లో పెట్రోలు విక్రయాల్ని ఎన్నికల సంఘం నిషేధించిందని తెలిపారు. డీజిల్‌ను పీపాల్లో కొట్టకపోవటం వల్ల ఆక్వా రైతులు ఇబ్బందులు పడుతున్నారన్న విషయాన్ని డీఎస్‌ఓ దృష్టికి తీసుకెళ్లగా, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకే లూజ్ అమ్మకాలను నిషేధించినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా, ముదినేపల్లిలోని పెట్రోలు బంకులకు పలువురు ఆక్వా రైతులు డీజిల్ కోసం వచ్చి లూజ్ అమ్మకాలు లేకపోవటంతో వెనుతిరిగి వెళ్లిపోయారు.

జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

చాట్రాయి, మే 21: మండలంలోని పోలవరంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు మరిడి చిట్టిబాబు, చీపురుగూడెం లో పార్టీ గ్రామ అధ్యక్షుడు తమ్మిశెట్టి లక్ష్మణరావు సోమ వారం రాత్రి జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. స్వయం కృషితో స్టార్‌గా ఎదిగి, ఆస్కార్ అవార్డు అందుకున్న జూనియర్ ఎన్టీఆర్ తాతకు తగ్గ మన వడని నిరూపించారని నాయకులు కొనియాడారు. ఈ సంద ర్భంగా అభిమానులు మిఠాయిలు పంచారు.

ఎండ వేడిమికి ప్రజలు విలవిల

కైకలూరు, మే 21: రెండు రోజులుగా వర్షపు జల్లులతో సేదతీరిన ప్రజలు మంగళవారం భానుడి ప్రతాపానికి విలవిల్లాడారు. మంగళవారం ఉదయం 7 గంటల నుంచే ఎండ వేడి విపరీతంగా ఉండడం, ఉక్కపోతతో ప్రజలు అల్లాడారు. ఉదయం 11 గంటలకే జాతీయ రహదారిపై జన సంచారం తగ్గింది. ప్రజలు కూల్‌డ్రింగ్స్, జ్యూస్ దుకాణాలకు ఎగబడ్డారు. కైకలూరులో నిత్యం రద్దీగా ఉండే తాలుకా సెంటర్ మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో నిర్మానుష్యం గా మారింది. సాయంత్రం వరకు వేడిమి తగ్గలేదు.

రాడ్లు, కర్రలతో దాడి..

ముదినేపల్లి, మే 21 : ముదినేపల్లి మండలం ఊటుకూరు గ్రామంలో గూడవల్లి శ్రీనుబాబు ఇంటిపై కొందరు దాడి చేసి అతనిని తీవ్రంగా గాయపర్చారు. పోలీసుల కథనం ప్రకారం ఆ గ్రామంలో ఈ నెల 19వ తేదీ రాత్రి జూనియర్ ఎన్టీఆర్ పుట్టిన రోజు వేడుకల సందర్భంగా ఇరు వర్గాల మధ్య గొడవ జరిగి కొట్లాటకు దారి తీసింది. గొడవను పెద్దలు సర్దుబాటు చేసినప్పటికీ సోమవారం అర్ధరాత్రి శ్రీను బాబు ఇంటిపై సురేష్, చైతన్య, మరి కొందరు రాడ్లు, కర్రల తో దాడి చేసి అతనితోపాటు అతని సోదరులు శివాజీ, శ్రీనివాసరావును తీవ్రంగా గాయపర్చారు. వారిని వెంటనే గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం బందరు తరలించారు. ఆస్పత్రి నుంచి అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి ఏఎస్ఐ పద్మజ దర్యాప్తు చేస్తున్నారు.



అగ్నిమాపక శకటం

శకటం వచ్చేసరికే...

అంతా బుగ్గి

- స్థలం కేటాయించినా నిర్మాణమేదీ?
- చాట్రాయిలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు 35 ఏళ్లుగా వినతి

చాట్రాయి, మే 21: మండల కేంద్రం చాట్రాయిలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని 35 ఏళ్ళ నుంచి ప్రజలు, ప్రజాప్రతినిదులు కోరుతున్నా, ఇంత వరకు కార్యరూపం దాల్చలేదు. మండల వ్యవస్థ ఏర్పడిన నాటి నుంచి విజ్ఞప్తులు చేస్తున్నా, పాలకుల ఉదాసీనత వల్ల అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు కాలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నేళ్ళ క్రితం మండల కార్యాల యాల ఆవరణలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు స్థలం కూడా కేటాయించా రు తప్ప నిర్మాణం ఊసే లేదు. చాట్రాయి మండలం పూర్తిగా గ్రామీణ ప్రాంతం. 90 శాతం కుటుంబాలు వ్యవసాయం పైనే ఆధారపడి జీవిస్తున్నాయి. అన్ని గ్రామాల్లో ఇప్పటికి కొంత మంది పేదలు రేకుల షెడ్లు, పూరి గుడిసెల్లో నివశిస్తున్నారు. అధిక శాతం మంది పక్కా ఇళ్ళు కట్టుకున్నప్పటికి పశువులు ఉండటం వలన ఇళ్ళ పక్కనే గడ్డివాములు ఉంచుతారు. షార్టు సర్క్యూట్, ఇతర కారణాల వల్ల అగ్ని ప్రమాదాలు సంభవించి ఆస్తి నష్టం జరుగుతున్నది. రబీ మొక్కజొన్న పూర్తి అయిన తరువాత రైతులు చొప్ప పొలాల్లో వదిలేస్తున్నారు. ఎవరైనా సిగిరెట్ కాల్చి పారేయటం, ఇతర కారణాల వల్ల ఈ చొప్పకు నిప్పు అంటుకొని నివాస ప్రాంతాల వైపు దూసుకు వస్తుండటంతో ప్రజలు హడలిపో తున్నారు. అగ్ని ప్రమాదం సంభవిస్తే, ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట నుంచి అగ్నిమాపక శకటం వచ్చేసరికి ఆస్తి నష్టం జరిగిపోతున్నది. మండల కేంద్రం చాట్రాయికి విస్సన్నపేట 12 కి.మీ., శివారు గ్రామాలు యర్రవారిగూడెం, చీపురు గూడెం తదితర గ్రామాలకు 30 కి.మీ. దూరంలో ఉంది. అంత దూరం నుంచి ఫైరింజన్ వచ్చేసరికి జరగాల్సిన నష్టం జరిగిపోయి బాధితులు కట్టుబట్టలతో నిలుస్తున్నారు. గతంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు చాట్రాయిలో అగ్నిమా పక కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీలు ఇచ్చారు కానీ హామీలు నీటి మూట లయ్యాయని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చాట్రా యిలో అగ్రిమాపక కేంద్రం ఏర్పాటుకు లని ప్రజలు కోరుతున్నారు.

విజ్ఞప్తులు చేసినా ఫలితం లేదు



సకాలంలో విస్సన్నపేట నుంచి ఫైరింజను రాకపో వటం వల్ల సర్వం బుగ్గిపాలవుతోంది. చాట్రాయిలో అగ్నిమాపక కేంద్రం ఉంటే ఆస్తి నష్టం జరగకుండా ఆపే అవకాశం ఉంది. 30 ఏళ్ళ నుంచి పాలకులకు ఎన్ని విజ్ఞప్తులు చేసినా ఫలితం కలగలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికా రులు స్పందించి చాట్రాయిలో అగ్నిమాపక కేంద్రం మంజూరు చేయాలి.

- కోట జోషి, చాట్రాయి.



ఎదుర్కోలు ఉత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణోత్సవానికి సిద్ధమవుతున్న వేదిక



నేత్ర పర్వం.. శ్రీవారి ఎదుర్కోలు ఉత్సవం

ద్వారకాతిరుమల, మే 21: బ్రహ్మాండ నాయకుని దివ్యబ్రహ్మోత్సవాల్లో భాగం గా జరిగిన ఎదుర్కోలు ఉత్సవాన్ని మంగళవారం రాత్రి అర్చకులు వేడుకగా నిర్వహించారు. స్వామివారి కల్యాణానికి ముందు రోజున ఈ ఉత్సవాన్ని నిర్వహించడం సంప్రదాయం. శ్రీవారి ఆలయ ఆవరణలో వెండి శేష వాహనంపై ఉభయ దేవేరులతో వేంచేసిన స్వామివారికి ప్రత్యేక పుష్పాలం కరణ చేసి నిత్యకల్యాణ వేదిక వద్దకు తెచ్చారు. అనంతరం హారతులిచ్చి అర్చ కులు ఎదుర్కోలు ఉత్సవాన్ని ప్రారంభించారు. మంటపంలో అర్చకులు, అధికారులు, పండి తులు, భక్తులు రెండు జట్లుగా విడిపోయి ఒక జట్టు స్వామివారి గుణగణాలను, ఆయన విశిష్టతను కొనియాడారు. రెండో జట్టు అమ్మవార్ల గుణగణాలను, వారి కీర్తిని తెలియజేశారు.

నేడు స్వామి వారి కల్యాణం

ద్వారకాతిరుమ లేశుని దివ్య కల్యాణ మహోత్సవానికి దేవ స్థానం సర్వం సిద్ధం చేసింది. ఇందులో భాగం గా చినవెంకన్న కల్యాణాన్ని బుధవారం రాత్రి అంగ రంగ వైభవంగా జరిపేందుకు కళా వైభవాలతో అనివేటి మంటపంలో ఏర్పాటు చేసిన కల్యాణ మంటపాన్ని సిబ్బంది ముస్తాబు చేస్తున్నారు. మంటప పరిసరాలను శోభాయమానంగా తీర్చిది ద్దారు. పూల అలంకరణ పనులు మంగళవారం రాత్రికి పూర్తవుతాయని ఆలయ ఈఓ వేండ్ర త్రినాధరావు తెలిపారు. బుధవారం రాత్రి 8 గంటలకు ప్రారంభమయ్యే ఈ కల్యాణ వేడుకను తిలకించేందుకు భక్తులు తరలిరావాలని ఈఓ కోరారు.

హనుమద్వాహనంపై శ్రీవారు

శ్రీవారు హనుమద్వాహనాన్ని అధిష్ఠించి మంగళవారం ఉదయం తిరువీధుల్లో ఊరేగారు. బ్రహ్మోత్సవాల్లో వాహనసేవల్లో భాగంగా శ్రీవారు రోజుకో అలంకారం లో భక్తులకు దర్శనమిస్తారు. ధనుర్బాణాలను ధరించి రామావతారంలో కొలువు తీరిన శ్రీవారు హనుమంత వాహనంపై ఊరేగగా దారి పొడవునా భక్తులు స్వామి, అమ్మవార్లకు హారతులు పట్టారు. లక్ష్మణ సమేతంగా హనుమం తుని భుజస్కందాలపై ఆశీనులైనట్లున్న స్వామివారిని భక్తులు దర్శించి తరించారు.



సుదర్శన హోమం

వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కైకలూరు, మే 21: కైకలూరులోని శ్రీ భూ సమేత మీసాల వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను మంగళవారం వైభవంగా ప్రారంభించారు. స్వామివారికి విష్వక్సేన పూజ, పంచామృతాలతో అభిషేకాలు, స్వామివారిని పెండ్లి కుమా రుడిగా, అమ్మవార్లను పెండ్లికుమార్తెలుగా అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం సుదర్శన హోమం జరిపారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం స్వామివారిని గజవాహనంపై ఊరేగించారు. ఆలయ ఈవో వీఎన్‌కె శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లను నిర్వహించి భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. బుధవారం రాత్రి 7 గంటలకు స్వామివారి కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చి కల్యాణం తిలకించాలని ఆలయ అధికారి కోరారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో అన్నసమారాధన



కైకలూరు చిన్నచెరువుగట్టుపై గల శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలను నిర్వహించి భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ప్రతి నెలా మూడో మంగళవారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించి కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన చేస్తారు. ఈ సమారాధనలో భక్తులు భారీగా పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం



కలిదిండి: కోరుకొల్లులోని పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెగా అలంకరించి విశేష పూజలు చేశారు. ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ చైర్మన్ చెన్నంశెట్టి శ్రీనివాసరావు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి అల్లూరులో..

ముదినేపల్లి: మండలంలోని అల్లూరులో పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో బుధవారం నుంచి స్వామివారి కల్యాణోత్సవాలు ప్రారంభం కాను న్నాయి. ఆలయం వద్ద విస్తృత ఏర్పాట్లు చేశారు. గురువారం కల్యాణోత్సవం, శుక్రవారం రుద్రహోమం, లక్ష్మీగణపతి హోమం, శుక్రవారం అన్నసమారాధన జరుగుతుందని ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. పెదతుమ్మిడికి చెందిన యాజ్ఞికుడు సోమరాజుపల్లి ఈశ్వర శర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు ఐలూరి సుబ్బరాయ శర్మ కల్యాణోత్సవాలను నిర్వహిస్తారు.

పెండ్లికుమారుడైన వేణుగోపాలుడు

ముదినేపల్లి రూరల్: వడాలిలోని సుభద్ర, బలరామ సమేత జగన్నాథ స్వామి ఆలయంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామిని మంగళవారం పెండ్లి కుమారుడిగా మంగళవారం అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణోత్సవాల్లో భాగంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. నాలుగురోజుల పాటు నిర్వహించే ఈ కల్యాణోత్సవాలు తిలకించటానికి వడాలి పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. ప్రత్యేక భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

టెన్త్ సప్లిమెంటరీకి 5 పరీక్ష కేంద్రాలు

నూజివీడు టౌన్, మే 21: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు నూజివీడు డివిజన్‌లో ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు నూజివీడు డీవైఈవో సేవ్యా తెలిపారు. డివిజన్ పరిధిలో ఈ నెల 24 నుంచి నిర్వహించ నున్న పరీక్షలకు గాను నాలుగు మండలాల్లో మొత్తం 952 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అవుతున్నారన్నారు. వీరిలో చాట్రాయి జడ్పీ హైస్కూలులో 99 మంది, ఆగిరిపల్లి జడ్పీ హైస్కూలులో 214 మంది, ముసునూరు జడ్పీ హైస్కూలులో 240 మంది, నూజివీడు ఎస్.ఆర్.ఆర్ బాలుర ఉన్నత పాఠ శాలలో 202 మంది, నూజివీడు బాలికోన్నత పాఠశాలలో 197 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు.



రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

నూజివీడు టౌన్, మే 21: దేశంలో సాంకేతిక విప్లవాన్ని తీసుకువచ్చిన ఘనత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకే దక్కుతుందని, నూజివీడు కాంగ్రెస్ పార్టీ నాయకులు బి.డి. రవికుమార్, పరిమిసాగర్ కుమార్‌లు అన్నారు. రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని నూజివీడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంకేతిక రంగంలో దేశాన్ని అభివృద్ధి చేయటమే కాక 18 ఏళ్లకే ఓటుహక్కు, మహిళలకు స్థానిక సంస్థల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ నూజివీడు, ముసునూరు మండల అధ్యక్షులు సూర్యదేవరప్రసాద్, పల్లెపాం ప్రసాద్, వనమా ఫ్రాన్సిస్, జయరాజు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా ఉపాధి పనులు

చాట్రాయి, మే 21: మండలంలో అన్ని గ్రామాల్లో ఉపా ధి హామీ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం వ్యవసాయ పను లు లేకపోవటంతో ఉపాధి కూలీలు భారీగా హాజరవుతున్నారు. మొత్తం 18 గ్రామ పంచాయతీల పరిధిలో 19 పనులు జరుగుతుండగా, మంగళవారం 5051 మంది కూలీలు హాజరయ్యారని, చేసిన పనిని బట్టి సగటున కూలీ రూ. 221 పడుతున్నదని ఏపీవో లక్ష్మీకుమారి చెప్పారు. ఫీల్డ్ ఛానల్స్, ఫీడర్ ఛానల్స్ పూడికతీత పనులు, సరిహద్దు కందకం తవ్వకాల పనులు జరుగుతున్నట్లు ఏపీవో వివరించారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

కలిదిండి, మే 21 : ఉపాధి పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళి రావు డిమాండ్ చేశారు. మంగళవారం పోతుమర్రు, చినతాడినాడ, సంతోషపురం గ్రామాల్లో ఉపాధి పని ప్రదేశాలను సందర్శించి కూలీల సమస్య లడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పని ప్రదేశాల్లో టెంట్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లపై భారం వేయకుండా ప్రభుత్వమే తాగునీరు, మజ్జిగ పంపి ణీ చేయా లని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సభ్యుడు ఎ.వెంకటేశ్వరరావు, కె.లక్ష్మీ తిరుపతమ్మ, సక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.

ఏబీపై ప్రభుత్వం కక్ష సాధింపు : పాశం



ఏబీ వెంకటేశ్వరావును కలసిన నాగబాబు

ముసునూరు, మే 21: సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావుపై వైసీపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడు తోందని జనసేన సెంట్రల్ ఆంధ్ర కమిటీ సభ్యుడు పాశం నాగబాబు ఆరోపించారు. మంగళవారం విజయవాడలో ఆయన ఏబీని కలిసి పరిస్థితిపై చర్చించారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ క్యాట్ తీర్పుపై జగన్‌రెడ్డి ప్రభుత్వం కోర్టుకు వెళ్ళడం కక్ష సాధింపేనని, చట్టాలను ఉల్లంఘిస్తూ, అప్రజాస్వామిక పాలనకు వైసీపీ ప్రభుత్వమే నిలువెత్తు నిదర్శనమన్నారు. మరికొద్ది రోజుల్లో పదవీ విరమణ చేయబోతున్న ఏబి వెంకటేశ్వరరావుకు తక్షణమే ఈ ప్రభుత్వం పోస్టింగ్ ఇవ్వాలని నాగబాబు డిమాండ్ చేశారు.

ఒడీఎఫ్ ప్లస్ గ్రామాల పరిశీలన



ఆగిరిపల్లి, మే 21: ఓడీఎఫ్ ప్లస్ గ్రామాలుగా నమోదైన ఈదర, నరసింగ పాలెంలను నూజివీడు ఎంపీడీవో కిరణ్, నూజివీడు ఆర్‌డబ్ల్యు డీఈ, ఈవోఆర్డీవో, ఆగిరిపల్లి ఎంపీడీవో శామ్యూ ల్, పంచాయతీ ఈవో ప్రసాద్, సచివాలయ సిబ్బంది పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తున్నట్లు శామ్యూల్ తెలిపారు.

మాజీ ఎంపీ కొనకళ్లకు పరామర్శ

ముదినేపల్లి, మే 21 : మాజీ ఎంపీ, కృష్ణా జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావును మంగళవారం పలువురు ముదినేపల్లి మండల టీడీపీ నాయకులు పరామర్శించారు. అనారోగ్యానికి గురై విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది తిరిగి వచ్చిన ఆయన్ని మచిలీపట్నంలో టీడీపీ నాయకులు బొర్రా చలమయ్య, బొర్రా శేషు, శొంఠి నాగరాజు, యార్లగడ్డ గంగయ్య, వీరంకి చక్రపాణి, గౌడ సంఘం నాయకుడు పోసిన చెంచు రామారావు తదితరులు పరామర్శించారు.